# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను
జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక
ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.
అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు
సంప్రదించండి: 9398 15 6948



సంపుటి : 01 సంచిక : 262, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజిలు : 08, వెల రూ. 5రూ/ సోమవారం -20 - జనవరి - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


# లఅమిత్ షా అన్ని అంశాల్లో వినూత్నంగా ఆలోచిస్తారన్న చంద్రబాబు

- అమిత్ షా పనితీరు చూస్తే కొన్నిసార్లు అసూయ కలుగుతుంది
- కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు
- హాజరైన అమిత్ షా, చంద్రబాబు తదితరులు
- కేంద్రం నుంచి మరింత సహకారం కోరుతున్నామని వెల్లడి



**అమరావతి,:** కొండపావులూరులో నిర్వహించిన ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

## మోదీ, చంద్రబాబు నాయకత్వంలో అంతకు మూడింతల ప్రగతి సాధిస్తాం



- ఏపీలో అమిత్ షా పర్యటన
- ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు
- ఎన్ఐడీఎం ప్రాంగణానికి ప్రారంభోత్సవం
- ఏపీలో కూటమికి చరిత్రాత్మక విజయం అందించారని వెల్లడి

**అమరావతి,:** కేంద్ర మంత్రి అమిత్ షా ఏపీలో పర్యటిస్తున్నారు. ఆయన కృష్ణా జిల్లా కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా

## గన్నవరం ఎయిర్ పోర్టులో అమిత్ షాకు వీడ్కోలు పలికిన నారా లోకేశ్



- ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హెూంమంత్రి అమిత్ షా
- ఎన్డీఆర్ఎఫ్ నూతన ప్రాంగణం ప్రారంభోత్సవంలో పాల్గొన్న లోకేశ్

**అమరావతి,:** కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో నిర్వహించిన జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం 20వ వ్యవస్థాపక దినోత్సవంలో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి,

## మోదీ జీ.. వారికి భూమిలిచ్చి ఆదుకోండి



### కేజ్రీవాల్ మరో లేఖ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు మరింత సమీపిస్తున్న వేళ.. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్.. వరుసగా ప్రధాని నరేంద్ర మోదీకి లేఖాస్త్రాలు సంధిస్తూనే ఉన్నారు. ఇప్పటికే పలు అంశాలపై లేఖలు రాసిన కేజ్రీవాల్.. మరొకసారి మోదీకి లేఖ రాశారు. ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులందరికీ నివాసాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. ఇందుకోసం ఒక స్కీమ్‌ను తీసుకొచ్చి, మిగతా 2లో..

## గాజా ఒప్పందం ఆలస్యం!.. హమాస్‌కు ఇజ్రాయెల్ వార్నింగ్!



జెరుసలేం : గాజాలో శాంతి ఒప్పందం వేళ ఇజ్రాయెల్ సైన్యం హమాస్‌కు హెచ్చరికలు జారీ చేసింది. ఇచ్చిన మాటకు కట్టుబడడం లేదని, అందుకే తాము గాజాపై దాడుల్ని కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి, రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి మాట్లాడుతూ..హమాస్ చెరలో బంధీలుగా

## ఐక్యత, సమానత్వం అసాధారణ సంగమంగా మహాకుంభ మేళా



### భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు

న్యూఢిల్లీ: మహాకుంభ మేళా ఐక్యత, సమానత్వం అసాధారణ సంగమంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయంలో ఎక్కడా వివక్షత, కులతత్వం లేదన్నారు. ప్రధాని

## రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి.. హరీశ్‌రావు విజ్ఞప్తి



### రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలం

### రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతుంది

**హైదరాబాద్, :** ఆదిలాబాద్ జిల్లాలో 24 గంటలు గడవకముందే రుణభారంతో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బ్యాంకుల వేధింపులతో ఆత్మహత్యలు

# హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలురాయి..!!



### సింగపూర్ పర్యటనలో సీఎం రేవంత్ వరుస ఒప్పందాలు

**హైదరాబాద్, :** ముఖ్యమంత్రి రేవంత్ పెట్టబడుల ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. సింగపూర్ పర్యటనలో సీఎం రేవంత్ వరుస ఒప్పందాలు చేసుకుంటున్నారు. రేవంత్ టీం దావోస్ పర్యటనకు ముందుగా సింగపూర్ లో పలు సంస్థలతో చర్చలు చేస్తోంది. తెలంగాణలో పెట్టబడులు.. సహకారం పైన అవగాహన ఒప్పందాలు చేసుకుంటోంది. అందులో భాగంగా హైదరాబాద్ లో ఐటీ పార్క్ కోసం క్యాపిటల్ లాండ్ తో రేవంత్ ప్రభుత్వం ఎంఓయూ చేసుకుంది. ఇక, దావోస్ కేంద్రంగా పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో రేవంత్ సమావేశం కానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ సింగపూర్ పర్యటనలో పలు

## కాంగ్రెస్ పాలనలో స్ట్రీట్ లైట్స్ కూడా వెలగడం లేదు



### బీజేపీ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్,కాంగ్రెస్‌లకు లేదు

### డబుల్ ఇంజన్ సర్కారు ద్వారానే తెలంగాణకు న్యాయం జరుగుతుంది

హైదరాబాద్:తెలంగాణలో బీఆర్ ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు తెలంగాణ నుఅభివృద్ధి చేయడంలో విఫల మయ్యాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం (జనవరి19) కిషన్‌రెడ్డి సమక్షంలో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలు చూస్తున్నాం. రెండు పార్టీలు తెలంగాణను అభివృద్ధి చేయడంలో విఫలమయ్యాయి. రెండు పార్టీలు బొమ్మ బొరుసులా వ్యవ హరిస్తున్నాయి. రెండు పార్టీలు తెలంగాణను దోపిడీ చేస్తున్నాయి. నగరంలో వీధి లైట్లు వెలగలేక వెలవెల పోతున్నాయి.కిందిస్థాయి మిగతా 2లో..

## రాజకీయం కోసమే పసుపు బోర్డును ప్రకటించారు: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



- ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామన్న కవిత
- రాజకీయ కోణంలోనే బీజేపీ ప్రకటన చేసిందన్న ఎమ్మెల్సీ
- ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని విమర్శ

**అమరావతి,:** రాజకీయం కోసమే పసుపు బోర్డును ప్రకటించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎంలకు భూమి కేటాయించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



- ఎన్డీఆర్ఎఫ్ 20వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న పవన్
- ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది లక్షల మంది ప్రాణాలు కాపాడారని వెల్లడి
- మూగ జీవాల ప్రాణాలు కూడా కాపాడారని ప్రశంసలు

**అమరావతి,:** కృష్ణా జిల్లా కొండ పావులూరులో ఎన్డీఆర్ఎఫ్ 20వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది లక్షల మంది ప్రాణాలు కాపాడారని, ముఖ్యంగా, విజయవాడ వరదల్లో ఎన్డీఆర్ఎఫ్ సేవలు మర్చిపోలేమని అన్నారు. ఎన్డీఆర్ఎఫ్ 18 వేలకు పైగా రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించిందని, మూగ జీవుల ప్రాణాలను కూడా రక్షించిందని పవన్ కల్యాణ్ కొనియాడారు.

# జగన్ పై అమిత్ షా ఆరా

## - నియోజకవర్గాల పెంపు..!!

- కూటమి పార్టీలు జగన్ లక్ష్యంగా రాజకీయ వ్యూహాలు అమలు
- జమిలి ఎన్నికల దిశగా అడుగులు వేస్తున్న వేళ ఏపీలో నియోజకవర్గాల పునర్విభజన పైన ఫోకస్
- అమిత్ షా మాజీ సీఎం జగన్ గురించి ఆరా తీయటం ఆసక్తి కరం
- ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి 225 కి పెంచాల్సి ఉంది



**అమరావతి,:** ఏపీలో రాజకీయ సమీకరణాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కూటమి పార్టీలు జగన్ లక్ష్యంగా రాజకీయ వ్యూహాలు అమలు చేస్తున్నాయి. కేంద్ర జమిలి ఎన్నికల దిశగా అడుగులు వేస్తున్న వేళ ఏపీలో నియోజకవర్గాల పునర్విభజన పైన ఫోకస్ చేస్తోంది. తాజాగా అమిత్ షా కు చంద్రబాబు ఇచ్చిన విందు సమావేశంలో మహిళా రిజర్వేషన్ అమలు.. నియోజకవర్గాల పెంపు అంశం చర్చ కు వచ్చింది. అదే సమయంలో అమిత్ షా మాజీ సీఎం జగన్ గురించి ఆరా తీయటం ఆసక్తి కరంగా మారింది. జగన్ పై ఆరా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఏపీ పర్యటనకు వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసం లో అమిత్ షాకు విందు ఇచ్చారు. మిగతా 2లో..

# ఐక్యత, సమానత్వం అసాధారణ సంగమంగా మహాకుంభ మేళా

## మొదటి పేజీ తరువాయి

వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయంలో ఎక్కడా వివక్షత, కులతత్వం లేదన్నారు. ప్రధాని ఆదివారం 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ప్రసంగించారు. మహాకుంభ మేళాలో యువత పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. యువతరం ఆచార వ్యవహారాలను తెలుసుకున్నప్పుడే మన మూలాలు బలపడుతాయన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ భారతీయులకు గర్వకారణమన్నారు. మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిందన్న ప్రధాని.. అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ఈ సందర్భంగా జనవరి 25న జరుపుకునే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రస్తావించారు. ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైందని.. ఈ సంవత్సరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతుందని తెలిపారు. పవిత్రమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులకు తలవంచి నమస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి.. పటిష్ఠం చేస్తుందన్నారు. ప్రజాశక్తిని బలోపేతం చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ.. నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తుందని కొనియాడారు. అలాగే, అయోధ్య రామమందిరం వార్షికోత్సవంపై వ్యాఖ్యానించారు. వాస్తవానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి నెలా చివరి ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రసంగిస్తారు. ఈ నెల చివరి ఆదివారం రోజున రిపబ్లిక్ డే నేపథ్యంలో మూడో ఆదివారం రోజున మన్ కీ బాత్ 118వ ఎపిసోడ్ ప్రసారమైంది.

# గాజా ఒప్పందం ఆలస్యం!.. హమాస్‌కు ఇజ్రాయెల్ వార్నింగ్!

## మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి, రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి మాట్లాడుతూ..హమాస్ చెరలో బంధీలుగా ఉన్న 33 మంది బంధీల జాబితా విడుదల కాలేదు. బంధీల జాబితా మాకు చేరే వరకు కాల్పులు కొనసాగుతాయని చెప్పారు. ఆదివారం ఉదయం నాటికి కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా తన వద్ద ఉన్న బంధీల జాబితాను విడుదల చేయాలి. కానీ అలా చేయలేదు. ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. హమాస్ ఇచ్చిన మాటకు కట్టుబడే వరకు కాల్పుల విరమణ అమలులోకి రాదు అని' హగరీ చెప్పారంటూ ఓ ఇజ్రాయెల్ సైన్య అధికారి వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. అంతకు ముందు, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సైతం కాల్పుల విరమణపై కీలక వ్యాఖ్యలు చేశారు. బంధీల జాబితా విడుదల చేయనంత వరకు సైనిక దాడులు కొనసాగుతాయని, ఆ తర్వాత జరిగే పరిణామాలకు తాము బాధ్యులం కాదని సూచించారు.

గాజాలో శాంతి

పదిహేను నెలలుగా రక్తమోడుతున్న గాజాలో శాంతి నెలకొంది. గత బుధవారం అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్య వర్తిత్వంతో ఇజ్రాయెల్ హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరింది. ఒప్పందంలో భాగంగా.. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 8.30 గంటలకు కాల్పుల విమరణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. కానీ సాంకేతిక అంశాల్ని కారణంగా చూపిస్తూ బంధీల జాబితాను విడుదల చేయడంలో జాప్యం చేసింది. కాగా, కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్ చెరలో ఉన్న 33 మంది బంధీలను విడుదల చేయాలి. ప్రతిఫలంగా ప్రస్తుతం జైళ్లలో మగ్గుతున్న దాదాపు 2,000 మంది పాలస్తీనియన్లను కూడా ఇజ్రాయెల్ విడుదల చేయనుంది.

# రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి.. హరీశ్‌రావు విజ్ఞప్తి

## మొదటి పేజీ తరువాయి

రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బ్యాంకుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల చావులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఉసురు ఎందుకు తీస్తున్నారని నిలదీశారు. రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని తెలిపారు. వరుసగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అని.. అలాంటి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇప్పటి వరకు మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఇంత జరుగుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టాడని హరీశ్‌రావు విమర్శించారు. గతంలో రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియజేస్తున్న రైతులను అరెస్టు చేసి, పోలీస్ యాక్ట్ (30 %ూవ్%) పేరుతో జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కారని విమర్శించారు. రుణమాఫీ జరగకపోవడంతో రైతులు కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ విసిగిపోతున్నారని అన్నారు. ఉన్న భూములు కుదవ పెట్టి అప్పులు తెస్తున్నారని.. ఆ అప్పులు చెల్లించలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అని మభ్య పెట్టి.. 500 బోనస్ అని మోసం చేసి.. పెట్టుబడి సాయన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ దురవస్థ వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడలేదన్న విషయం, కాంగ్రెస్ పాలకులు పూర్తిగా మరిచిపోయినట్లున్నారని హరీశ్‌రావు అన్నారు. రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి అని విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని.. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా అందరికీ రుణమాఫీ, రైతు భరోసా, అన్ని పంటలకు 500 బోనస్ హామీలు అమలు చేసే దాకా నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

# హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలురాయి..!!



## మొదటి పేజీ తరువాయి

ఇక, దావోస్ కేంద్రంగా పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో రేవంత్ సమావేశం కానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ సింగపూర్ పర్యటనలో పలు ఒప్పందాలు చేసుకుంటున్నారు. పెట్టుబడి దారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో రూ. 450 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ప్రపంచ అగ్రగామి సంస్థ క్యాపిటల్యాండ్ ముందుకొచ్చింది. దాదాపు ఒక మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక ఐటీ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. సింగపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో క్యాపిటల్యాండ్ కీలక నిర్ణయం ప్రకటించింది. ప్రీమియం సౌకర్యాలను కోరుకునే బ్లూ-చిప్ కంపెనీలు. గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల నుండి పెరుగుతున్న డిమాండ్‌ను కొత్త ప్రాజెక్ట్ తీర్చనుంది. క్యాపిటల్ ల్యాండ్ కొత్త ప్రాజెక్ట్, హైదరాబాద్ అభివృద్ధికి మరింత దోహద పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ సాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధిలో ఇదొక మైలురాయిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే మూడు వ్యాపార పార్కులను కాపిటాల్యాండ్ నిర్వహిస్తోంది. ఇంటర్నేషనల్ టెక్ పార్క్ హైదరాబాద్ , ఎవాన్స్ హైదరాబాద్, సైబర్ పెర్ల్ ఏర్పాటు చేసిన క్యాపిటల్యాండ్ హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ టెక్ పార్క్ రెండవ దశ పనులు ఈ ఏడాది ప్రారంభమై 2028నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడుల ద్వారా తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే సింగపూర్ పర్యటనలో భాగంగా ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో తెలంగాణలో యంగ్ ఇండియా యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది.

# కాంగ్రెస్ పాలనలో స్ట్రీట్ లైట్స్ కూడా వెలగడం లేదు



## మొదటి పేజీ తరువాయి

నగరంలో వీధి లైట్లు వెలగలేక వెలవెల పోతున్నాయి. కింది స్థాయి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉంది.లిక్కర్ మీద వచ్చే డబ్బులు కూడా మళ్లించడం ద్వారా లిక్కర్ కంపెనీలు కూడా రాష్ట్రానికి మద్యం ఇచ్చేదిలేదని చెబుతున్నాయి. బీజేపీపై ప్రజలు నమ్మకం ఉంచారు కాబట్టే ఎనిమిది పార్లమెంట్ స్థానాలను ఇచ్చారు. బీజేపీ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్,కాంగ్రెస్‌లకు లేదు.తెలంగాణ అప్పుల కుప్పగా మారడానికి ఈ రెండు పార్టీలే కారణం.ఒక్క అవినీతి మచ్చ లేకుండా మూడు దఫాలుగా మోదీ దేశాన్ని పరిపాలిస్తున్నారు.తెలంగాణ అభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి.డబుల్ ఇంజన్ సర్కారు ద్వారానే తెలంగాణకు న్యాయం జరుగుతుంది. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తెలంగాణలో పర్యటించే నైతిక హక్కు రాహుల్ గాంధీకి లేదు. రాజ్యాంగం పేరుతో రాహుల్ గాంధీ పచ్చి అబద్ధాలు,విష ప్రచారాలు చేస్తున్నారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసింది,అవమాన పరిచింది కాంగ్రెస్ పార్టీ.రాజ్యాంగంపై అనేక కుట్రలు చేసి,అంబేద్కర్‌ను అనేక రకాలుగా అవహేళన చేసిన మొదటి ముద్దాయి కాంగ్రెస్ పార్టీ.పంచతీర్థ పేరుతో అంబేద్కర్‌ను సగౌరవంగా గౌరవించిన పార్టీ బీజేపీ. తెలంగాణలో బీజేపీ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది.రాజ్యాంగం ఏర్పాటు చేసుకొని 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా భారత రాజ్యాంగ గౌరవ ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహిస్తున్నాం. ఇంటింటికి వెళ్తాం. రాజ్యాంగంపై కాంగ్రెస్ చేసిన అవహేళన చరిత్రను ప్రజలకు తెలియజేస్తాం.రాజ్యాంగంపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను బయట పెడతాం.సేవ్ తెలంగాణ పేరుతో యువత ముందుకు రావాలి'అని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# మోదీ జీ.. వారికి భూమిలిచ్చి ఆదుకోండి

## మొదటి పేజీ తరువాయి



ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులందరికీ నివాసాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. ఇందుకోసం ఒక స్కీమ్‌ను తీసుకొచ్చి, దాని ద్వారా వారికి ఈఎంఐల రూపంలో నగదు చెల్లించే అవకాశం ఇవ్వాలన్నారు. ఆదివారం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన కేజ్రీవాల్.. ' ఢిల్లీ ప్రభుత్వానికి భూములు ఇవ్వండి. ఎందకంటే గవర్నమెంట్ ఉద్యోగులు ఇళ్లు నిర్మించుకోవడానికి ఈ భూమిని పంపిణీ చేద్దాం. రాజ్యాంగం ప్రకారం దేశ జాతీయ రాజధాని అయిన ఢిల్లీలో భూ పంపిణీ చేసే అధికారం అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఈ అంశం కేంద్రం చేతుల్లో ఉంది. అందుకే ప్రధాని మోదీకి లేఖ రాశాను' అని పేర్కొన్నారు. ఢిల్లీలోని పారిశుద్ధ్య కార్మికులు గురించి కూడా లేఖలో మోదీకి కి వివరించినట్లు కేజ్రీవాల్ తెలిపారు. ' ఎన్‌డీఎంసీ, ఎంసీడీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నివాసం ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. వారికి రాయితీలు కల్పించి తక్కువ రేట్లకు భూమిని ఇస్తే వారు గృహాలను ఏర్పాటు చేసుకుంటారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వీరిది కీలక పాత్ర. వారు నగరానికి బ్యాక్‌బోన్ వీరు భూమి కోసం తీసుకున్న రుణాన్ని నెలవారీ పద్ధతుల్లో తిరిగి చెల్లించే విధంగా స్కీమ్ తీసుకురండి. వారు ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసిన వాటిల్లో నివాసం ఉంటున్నారు. అవి తాత్కాలికమే. రిటైర్మెంట్ అయిన తర్వాత వారు ఆ గృహాలను వదిలేయాల్సిన పరిస్థితి ఉంది. శానిటేషన్ కార్మికులు వేరే ఇళ్లు కొనుక్కోవాలన్నా, ఢిల్లీ వంటి మహా నగరంలో అద్దెకు ఉండాలన్నాఅది భరించలేనంతగా ఉంది. అలా కాకుండా వారికి భూమిని ప్రభుత్వమే ఇచ్చి ప్రోత్సహం ఇస్తే వారికి ఎంతో మేలు చేసిన వారిగా మిగిలిపోతాం' అని లేఖలో పేర్కొన్నట్లు కేజ్రీవాల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తెలిపారు. ఇటీవల జాట్స్ కమ్యూనిటీని ఓబీసీల్లో చేర్చాలనే డిమాండ్‌ను ప్రధాని మోదీ దృష్టి తీసుకొచ్చారు కేజ్రీవాల్. జాట్స్ కమ్యూనిటీని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాలో చేర్చాం. కానీ కేంద్ర ప్రభుత్వం జాబితాలో వారిని ఇంకా ఓబీసీ జాబితాలో చేర్చలేదు. ఒకవేళ ఇలా చేస్తే రాజస్తాన్ నుంచే వచ్చే జాట్స్ ఢిల్లీ యూనివర్శటీల్లో అడ్మిషన్లు పొందడంతో పాటు, ఎయిమ్స్‌లో జాబ్స్‌కూ పొందవచ్చు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని అన్ని సంస్థల్లో ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉంచితే, గత రెండు పర్యాయాలుగా ఢిల్లీలోఆప్ అధికారాన్ని చేపట్టింది. 2013 నుంచి ఇప్పటివరకూ ఆప్ ఢిల్లీలో అధికారంలో ఉంది. అయితే ఈసారి ఎలాగైనా ఢిల్లీ పగ్గాల్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని బీజేపీ గట్టిగా ప్రయత్నిస్తోంది. ఆప్‌కు ధీటుగా ప్రచారాన్నిసాగిస్తూ బీజేపీ సైతం దూసుకుపోతోంది. ఎన్నికల ఫలితం ఎలా ఉన్నా వీరిద్దరి ప్రచారం నువ్వా-నేనా అన్నట్లు సాగుతోంది. ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

# జగన్ పై అమిత్ షా ఆరా

## మొదటి పేజీ తరువాయి



ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసం లో అమిత్ షాకు విందు ఇచ్చారు. ఈ సమయంలో చంద్రబాబుతో అమిత్ షా అనేక అంశాల పైన చర్చించారు. జగన్ గురించి ఆరా తీసినట్లు తెలుస్తోంది. చంద్రబాబు నివాసం నుంచి ఇంద్రకీలాద్రి కనిపిస్తుండటం పైన అమిత్ షా ఆసక్తిగా గమనించారు. అదే సమయంలో జగన్ నివాసాలు.. రుషికొండ నిర్మాణం గురించి చర్చకు వచ్చింది. బెంగళూరులో జగన్ నివాసం గురించి లోకేష్ వివరించారు. జగన్ ప్రజల్లో తిరుగుతున్నారా అంటూ షా ప్రశ్నించారు. అందుకు బదులుగా ఎక్కువగా బెంగళూరులోనే ఉంటూ, అప్పుడప్పుడూ వచ్చి ప్రకటనలు మాత్రం ఇస్తున్నారని లోకేశ్ వివరించారు. సమస్యల ప్రస్తావన అంతరాష్ట్ర నదీ జలాల సమస్యలు ఉన్నాయా అని అమిత్ షా ప్రశ్నించారు. దీనికి స్పందనగా ప్రస్తుతానికి అలాంటివి ఏమీ లేవని.. కానీ, కృష్ణానదికి సంబంధించే వివాదాలు తలెత్తే అవకాశం ఉందని సీఎం వివరించినట్లు తెలిసింది. ఎన్టీఆర్ కు భారత రత్న గురించి చర్చకు వచ్చిన సమయంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఎన్నాళ్లు పనిచేశా రని అమిత్‌షా ఆరా తీశారు. కాంగ్రెస్‌కు తరుచూ ముఖ్యమంత్రులను మార్చే సంస్కృతి ఉంది కదా అలాంటప్పుడు ఇక్కడ ఎక్కువకాలం ఎవరు పనిచేశారని అడగ్గా కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్కువ కాలం పనిచేయగా ఆ తర్వాత రాజశేఖర్‌రెడ్డి ఆరేళ్లు సీఎంగా ఉన్నారని చంద్రబాబు బదులిచ్చారు. నియోజకవర్గాల పెంపు ఇదే సమయంలో ఎన్డీఏ పార్టీల సమన్వయం.. జమిలి ఎన్నికల గురించి వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక..మహిళా రిజర్వేషన్ల అమలు.. పార్లమెంట్ స్థానాల పెంపు గురించి చర్చించారు. కాగా, ఏపీ పునర్విభజన చట్టం మేరకు ఏపీలో ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి 225 కి పెంచాల్సి ఉంది. దీంతో..దీని పైన ఎలా ముందుకు వెళ్లాలనే అంశం పైన చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాల పైన చర్చకు వచ్చిందని.. ఏపీలో తరహాలోనే తెలంగాణలో నూ కూటమి కొనసాగింపు పైన ప్రతిపాదన చేసినట్లు సమాచారం. కాగా, త్వరలోనే ఢిల్లీలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

# అమిత్ షా అన్ని అంశాల్లో వినూత్నంగా ఆలోచిస్తారన్న చంద్రబాబు

## మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. హెూం మంత్రి అమిత్ షా సారథ్యంలో దేశంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని అన్నారు. అన్ని అంశాల్లోనూ అమిత్ షా వినూత్నంగా ఆలోచిస్తారని, ఏపీ పునర్ నిర్మాణం విషయంలోనూ కొత్తగా ఆలోచించాలని అమిత్ షా సూచించారని వెల్లడించారు. “భారతదేశంలో తిష్టవేసిన సమస్యలను పరిష్కరించేందుకు అమిత్‌షా పట్టుదలతో పని చేస్తున్నారు. శాంతిభద్రతలు కాపాడటంలో వినూత్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యేకంగా డ్యాష్ బోర్డు ఏర్పాటు చేసుకుని వ్యక్తిగతంగా పరిశీలిస్తున్నారు. నేను చాలామంది హెూంమంత్రులను చూశాను కానీ... ఇలాంటి సమర్థవంతమైన మంత్రిని మొదటిసారి చూస్తున్నా. అవసరమైన సాంకేతికత వినియోగించుకోవడం, నియామకాలు చేపట్టడమొక్కటే కాకుండా విపత్తుల సమయంలో ఎలా వ్యవహరించాలో సూచిస్తున్నారు. దేశంలో ఏ మూలాన ఆపదలో ఉన్నా వారి ప్రాణాలు కాపాడాలన్న సంకల్పంతో అమితాషా ఉన్నారు. దేశంలో ఎక్కడ శాంతిభద్రతలకు విఘాతం కలిగినా సమర్థవంతంగా పని చేసి చక్కదిద్దుతున్నారు. దేశంలో ఉగ్రవాదం, నక్సలిజం వంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారు. సమర్థతతో పని చేస్తున్న అమిత్ షా పనితీరును చూస్తే కొన్నికొన్నిసార్లు నాకు అసూయ కలుగుతుంది. మనిషిలా కాకుండా మిషన్‌లా పని చేస్తున్నారు. చాలా మంది నేతలు రిబ్బన్‌లు కట్ చేసి ప్రసంగించి వెళ్లిపోతారు. కానీ అమిత్‌షా మాత్రం ఏ అంశాన్ని తీసుకున్నా లోతుగా వివరాలు తెలుసుకుంటారు” అని వివరించారు. ఇక, గత ఎన్నికల్లో 93 శాతం స్ట్రయిక్ రేట్ తో ఏపీలో ఘనవిజయం సాధించామని చంద్రబాబు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ఏపీ అప్పు రూ.10 లక్షల కోట్లు ఉందన్నారు. ఎన్నికల సమయానికే ఏపీ వెంటిలేటర్ పై ఉందని అన్నారు. కేంద్రం ఆక్సిజన్ అందించడంతో ఏపీ వెంటిలేటర్ స్థితి నుంచి బయటపడిందని, అందుకు కేంద్రం పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వివరించారు. అయితే, ఏపీవెంటిలేటర్ స్థితి నుంచి బయటపడినా, ఇంకా పేషెంట్ గానే ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అమరావతి నిర్మాణం కోసం కేంద్రం రూ.15 వేల కోట్లు ఇచ్చిందని, ప్రస్తుతం పనులు కొనసాగు తున్నాయని వెల్లడించారు. కేంద్రం మార్గదర్శకత్వంలో పోలవరం డయాఫ్రం వాల్ పనులు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మద్దతుతో 2027 ఏప్రిల్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇక, తీవ్ర ఒడిదుడుకుల్లో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,440 కోట్ల ప్యాకేజీతో ఆర్థికసాయం చేసి ప్రాణం పోశారని చంద్రబాబు కొనియాడారు. ఇటీవల విశాఖ రైల్వే జోన్ కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు కేంద్రం మద్దతు ఇంకా కావాలని ఆకాంక్షించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రధాని మోదీ కలను సాకారం చేసేందుకు అందరం కృషి చేస్తున్నామని, ఏపీలోనూ విజన్-2047 లక్ష్యంగా ముందుకెళుతున్నామని తెలిపారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని అన్నారు.

# రాజకీయం కోసమే పసుపు బోర్డును ప్రకటించారు

## మొదటి పేజీ తరువాయి

**అమరావతి,:** రాజకీయం కోసమే పసుపు బోర్డును ప్రకటించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామని, కానీ ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును మాత్రం వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ... పసుపు బోర్డు ఏర్పాటుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. దీనిని రాజకీయ కోణంలోనే ప్రకటన చేశారన్నారు. నిజంగా రైతుల కోసమే ఈ నిర్ణయమైతే పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారన్నారు. పసుపు బోర్డు కోసం బీఆర్ఎస్ పార్టీయే పోరాటం చేసిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే పసుపు బోర్డు కోసం కృషి చేశానన్నారు. నిజామాబాద్‌కు విమానాశ్రయం తీసుకురావాల్సిన బాధ్యత ఎంపీ అర్వింద్‌పై ఉందన్నారు.

# ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎంలకు భూమి కేటాయించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

## మొదటి పేజీ తరువాయి

ఎన్డీఆర్ఎఫ్ 18 వేలకు పైగా రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించిందని, మూగ జీవుల ప్రాణాలను కూడా రక్షించిందని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం ప్రాజెక్టులకు భూమి కేటాయించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి భారీ ప్యాకేజీ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ఏపీకి కేంద్రం అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపారు.

# గన్నవరం ఎయిర్ పోర్టులో అమిత్ షాకు వీడ్కోలు పలికిన నారా లోకేశ్



## మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తో పాటు రాష్ట్ర మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. ముందుగా నూతన ఎన్ఐడీఎం భవనంతో పాటు 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ నూతన ప్రాంగణాన్ని హెూంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మంత్రులతో కలిసి నారా లోకేశ్ పరిశీలించారు. సంస్థకు సంబంధించిన విషయాలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. అనంతరం ఎన్ఐడీఎం భవనంతో పాటు 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ ప్రాంగణ ప్రారంభోత్సవంలో ఇతర నేతలతో కలిసి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో మొక్క నాటారు. విపత్తుల సమయంలో ఎలా ఎదుర్కోవాలో తెలిపే విన్యాసాల రూపంలో ఎన్డీఆర్ఎఫ్ ప్రదర్శనను వీక్షించారు. అనంతరం తిరుపతి రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇతర నేతలతో కలిసి మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గన్నవరం ఎయిర్ పోర్ట్ లో కేంద్ర హెూంమంత్రి అమిత్ షాకు దగ్గరుండి నారా లోకేశ్ వీడ్కోలు పలికారు.

# మోదీ, చంద్రబాబు నాయకత్వంలో అంతకు మూడింతల ప్రగతి సాధిస్తాం



**అమరావతి,:** కేంద్ర మంత్రి అమిత్ షా ఏపీలో పర్యటిస్తున్నారు. ఆయన కృష్ణా జిల్లా కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇక్కడ నూతనంగా నిర్మించిన ఎన్ఐడీఎం ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా ప్రసంగించారు. తెలుగులో ప్రసంగించలేకపోతున్నందుకు అందరూ తనను క్షమించాలని నవ్వుతూ అన్నారు. ఎన్నికల్లో చరిత్రాత్మక విజయం అందించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని వెల్లడించారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం ఎల్లవేళలా సహకారం అందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏ విధంగా ధ్వంసం చేసిందో అందరికీ తెలుసని, గత ప్రభుత్వం చేసిన విధ్వంసం మానవ విపత్తుకు సంబంధించినదని అన్నారు. ఆ విపత్తు నుంచి రక్షించేందుకు ఎన్డీయే కూటమి వచ్చిందని అమిత్ షా పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం గురించి చింతించవద్దని... ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల నాయకత్వంలో ఏపీలో అంతకు మూడింతల ప్రగతి సాధిస్తామని భరోసా ఇచ్చారు. గడచిన ఆర్నెల్లలోనే ఏపీకి రూ.3 లక్షల కోట్ల విలువైన సహకారం అందించామని చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.11,440 కోట్ల ప్యాకేజి ప్రకటించామని, ఆంధ్రుల ఆత్మగౌరవంతో ముడిపడిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను ముందుకు తీసుకెళతామని చెప్పారు. గత ప్రభుత్వం అమరావతి రాజధానిని బుట్టదాఖలు చేసిందని, తాము అమరావతికి చేయూతనందిస్తామని తెలిపారు. హడ్కో ద్వారా అమరావతి నిర్మాణానికి రూ.27 వేల కోట్ల సాయం అందిస్తున్నామని అమిత్ షా వివరించారు. ఏపీకి జీవనాడి అయిన పోలవరంపై సీఎం చంద్రబాబుతో చర్చించానని అన్నారు. 2028 లోపు ఏపీ మొత్తం పోలవరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు పారిస్తామని పేర్కొన్నారు. ఏపీ అభివృద్ధి కోసం చంద్రబాబుకు ప్రధాని మోదీ అండదండలు ఉన్నాయని స్పష్టం చేశారు. విశాఖలో రూ.2 లక్షల కోట్ల గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు వస్తున్నాయని, విశాఖ రైల్వే జోన్ ను కూడా పట్టాలెక్కించామని అమిత్ షా వెల్లడించారు.

# స్టీల్ ప్లాంట్‌ను ఏం చేస్తారో చెప్పండి: బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం:స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ఇటీవల ఇచ్చిన ప్యాకేజీపై కార్మికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆదివారం(జనవరి19) బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడారు. 'వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని స్పష్టంగా ఎందుకు చెప్పలేదు. దీపం పథకంలో భాగంగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేసి ఉండాల్సిందని కేంద్ర మంత్రి కుమార్ స్వామి చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అప్పట్లో ఆపడం వల్లే ప్రైవేటీకరణ జరగలేదని ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామి చెప్పారు. ప్రధాని,అమిత్‌షా, సీఎం చంద్రబాబు ప్రయివేటీకరణ జరగదని ఎందుకు చెప్పలేదు. ప్రైవేటీకరణలో భాగంగానే ప్యాకేజీ ఇచ్చారు. స్టీల్ ప్లాంట్‌పై ముసుగులో గుద్దులాట వద్దు.మీ వైఖరి స్పష్టంగా చెప్పాలి. ఇచ్చే 11 వేల కోట్లకు ఎన్నో షరతులు పెట్టారు. ప్యాకేజీ వెనుక ఏదో మతలబు ఉంది. కోట్లాది మంది వచ్చిన కుంభమేళాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించారు. ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం తప్ప ఇంకేమీ కనిపించలేదు. తిరుపతి సంఘటనపై కోర్టులు సుమోటోగా కేసు నమోదు చేయాలి. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చెయ్యాలి. సొంతగా గనులు కేటాయించాలి. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. ఇచ్చిన మాటను కూటమి నేతలు నిలబెట్టుకోవాలి. లేదంటే కార్మికులతో కలిసి ఉద్యమం చేస్తాం.మొదటి నుంచి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం. కేంద్రహెూం మంత్రి వస్తే రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడడం మానేసి జగన్ ఏమి చేస్తున్నాడు అని మట్లాడుకుంటున్నారా. రుషి కొండ భవనాల కోసం డిన్నర్ మీటింగ్ పెట్టరా. వైఎస్ జగన్‌కు ఎన్ని బెడ్ రూములు, ఎన్ని బాత్ రూములు ఉన్నాయన్న దాని మీద చర్చిస్తారా. రాష్ట్రానికి ఇదేం ఖర్మ. చంద్రబాబు ప్రచారం కోసం దుబారా ఖర్చులు చేస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు. ప్రభుత్వంలో ఎవరికి ఎన్ని ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చుకుంటారో వారి ఇష్టం'అని బొత్స అన్నారు.

## గోకుల రామం లో జరిగిన రాపత్తు సేవ కార్యక్రమంలో పాల్గొన్న గుండాల ఎంపిటీసీ సర్పంచ్.







ఎటపాకజనవరి (జనం రిపోర్టర్ ): అల్లూరిసీతారామరాజు జిల్లాఎటపాక మండలం గుండాల .ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు హరిచంద్ర నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన రాపొత్తు సేవ నిమిత్తం గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి పురుషోత్తపట్నం సర్పంచ్ బుద్ధ ఆదినారాయణ , ఈరోజు శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది. స్వామి వారి పూజ కార్యక్రమాలు అనంతరం భరతనాట్యం కూచిపూడి వంటి సాంప్రదాయ నృత్యాలతో వచ్చిన భక్తులను అలరింప చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు మరియు భద్రాచలం నుంచి వచ్చిన రాముల వారి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## అంబేద్కర్ ను అవమానించిన అమీద్ షా గోబ్యాక్



రేపల్లె (జనం రిపోర్టర్ ):భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను పార్లమెంటు సాక్షిగా అవమానపరిచిన అమిత్ షా గో బ్యాక్ అంటూ సిపిఐ, సిపిఐ (ఎంఎల్) నాయకులు నిరసన వ్య దేక్తం చేస్తూ రేపల్లె రూరల్ మండలం పేటేరు గ్రామంలో శనివారం ఎర్రజెండాలు చేత బోని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రాన్ని వచ్చిన అమిత్ షా గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పేటేరు గ్రామంలో ప్రధాన కూడలిలో సిపిఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, సిపిఐ (ఎంఎల్) నాయకులు మర్రివాడ వెంకట్రావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ హోం శాఖ మంత్రి అమిత్ షా పదవి ప్రమాణ స్వీకారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంపై చేసిన విషయం గుర్తు లేదా అని వారు ప్రశ్నించారు. అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను పార్లమెంటు సాక్షిగా అవహేళనగా మాట్లాడిన అమిత్ షా పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలు అంబేద్కర్ ను కొనియాడుతుంటే మన దేశంలో మాత్రం బిజెపి ప్రభుత్వం తన మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడం కోసం అంబేద్కర్ ను అవమాన పరుస్తూ అవహేళనచేస్తుందని బాలాజీ, వెంకట్రావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మతవిద్వేషాలను రెచ్చగొడుతూ కులాల మధ్య చిచ్చుపెడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తోందని ఆరోపించారు. అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బాలాజీ, వెంకటరావు లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) నాయకులు దొంతు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, చందోలు ప్రసాద్, బేతపూడి ఏసుపాదం, సిపిఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, ఎఐవైఎఫ్ నాయకులు వి. శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు...

## నిరుపయోగంగా మున్సిపల్ లైబ్రరీ..



పొన్నూరు (జనం రిపోర్టర్ ):గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం 23వ వార్డులోని మున్సిపల్ సామాజిక లైబ్రరీ నిరుపయోగంగా మారింది. మున్సిపల్ అధికారులు ఈ లైబ్రరీపై దృష్టి సాధించకపోవడంతో ఈ ప్రాంతంలోని యువకులు మద్యం, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఈ లైబ్రరీ వాడుకలోకి లేకపోవటంతో శిథిలావస్థకు చేరింది. గతంలో ఈ లైబ్రరీలో పదుల సంఖ్యలో పత్రికలు వేసేవారని వార్డు ప్రజలు తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా లైబ్రరీ బాగోగులు అధికారులు పట్టించుకోకపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరిందని తెలిపారు. భవనం లోపల బండలు కూడా లేవని చుట్టూ ముళ్లకంచెలు పెరిగి దుర్భరంగా దర్శనమిస్తుందని ఆరోపించారు. 2019 సంవత్సరంలో గత ప్రభుత్వం ఈ లైబ్రరీ స్థలంలో సగభాగం వార్డు సచివాలయం నిర్మించారు. ప్రక్కన ఉన్న లైబ్రరీని పట్టించుకోకపోవడం పై వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఈ లైబ్రరీపై దృష్టి సారించి మరమ్మత్తులు చేయించి వాడుకలోకి తేవాలని కోరారు.

## కౌన్సిల్ మెంబర్ గా గుండేటి శివ శంకర్ నియామాకం



చొప్పదండి,(జనం రిపోర్టర్ ):చొప్పదండి పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గుండేటి శివ శంకర్ భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా కౌన్సిల్ మెంబర్ గా నియమితులైనట్లు ఒక ప్రకటకనలో తెలిపారు.ఈ సందర్భంగా చొప్పదండి పట్టణంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయనను సన్మానించడం జరిగింది.కార్యక్రమం లో శివ శంకర్ మాట్లాడుతూ....రాబోయే రోజుల్లో బిజెపి బలోపేతానికి కార్యకర్తలు అందరూ కృషి చేయాలని కోరుతూ ఈ సందర్భంగా నా నియామకానికి సహకరించిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణా రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు రాజన్నల రాజు, బిజెవైయం జిల్లా కార్యవర్గ సభ్యులు మంచికట్ల మల్లేశ్, పట్టణ అధ్యక్షులు చిల్ల శ్రావణ్, బత్తిని ప్రశాంత్, గుర్రం సమరసింహ రెడ్డి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## 'వినోద భోజనంబు'లో నవ్వులు రువ్విన చంద్రపాల్....



రామగుండం(జనం రిపోర్టర్ ):రామగుండం:జనవరి 19. ప్రముఖ హాస్య చిత్రాల దర్శకుడు స్వర్గీయ జంధ్యాల జయంతి సందర్భంగా హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ ఓపెన్ ఎయిర్ థియేటర్ లో హైదరాబాద్ హ్యూమర్ క్లబ్ శనివారం రాత్రి నిర్వహించిన 'వినోద భోజనంబు' నవ్వుల నజరానా హాస్య వినోద కార్యక్రమంలో గోదావరిఖని "స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్" ప్రధాన కార్యదర్శి చంద్రపాల్ స్టాండప్



కామెడీతో ప్రేక్షకుల్లో నవ్వులు పూయించి ప్రశంసలందుకున్నారు. నిర్వాహకులు, అతిథులు అతిధిలు, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, దూరదర్శన్ ప్రయోక్త ఓలేటి పార్వతీశం చంద్రపాల్ కు జ్ఞాపికను అందచేసి అభినందించారు. అనంతరం గోదావరిఖని స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, విశాఖపట్నం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ అధ్యక్షులు ఎం.వి సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ఫేం కళాకారుడు ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారితో కలిసి, చంద్రపాల్ ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ రాత్రి రైలు ప్రయాణం, చికెన్ సిక్స్టీ ఫైవ్, విందు భోజనం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచాయి. ఇంకా ఈ కార్యక్రమంలో శరత్ చంద్ర, వారణాసి కృష్ణమూర్తితోపాటు హాస్య కళాకారులు, ప్రేక్షకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ ట్రాక్టర్ షోరూమ్ ను ప్రారంభించిన అగ్రికల్చర్ మంత్రి అచ్చం నాయుడు



పెదకాకాని (జనం రిపోర్టర్ ):పెదకాకాని మండల పరిధిలో ఆటోనగర్లో ఆదివారం నాడు ఎలక్ట్రికల్ ట్రాక్టర్స్ షోరూమ్ ను అగ్రికల్చర్ మంత్రి అచ్చం నాయుడు ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి అచ్చం నాయుడు మాట్లాడుతూ మురుగప్ప గ్రూప్ వారు ఆసియాలోనే మొట్టమొదటి సారి ఆంధ్రప్రదేశ్లో రాజధాని గుంటూరులో ఈ షోరూం ను ప్రారంభించటం అభినందనీయమని కొనియాడారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్ తీసుకురావాలని ఇప్పటికే ఎలక్ట్రికల్ బస్సులు ఆటోలు బైకులు తీసుకురావడం జరిగింది ఇప్పుడు లేటెస్ట్ గా ఎలక్ట్రికల్ ట్రాక్టర్స్ షోరూమ్ రావడం మన ఆంధ్రప్రదేశ్ కు గర్వ కారణం అని ఈ విషయం తెలిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా సంతోషిస్తారని ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లి ఎలక్ట్రికల్ ట్రాక్టర్స్ వల్ల జరిగే ప్రయోజనాలు గురించి ముఖ్యమంత్రికి వివరిస్తారని దాని వలన రైతులు ఏ విధమైన ప్రయోజనాలు కలుగుతాయో తెలియజేస్తానని ముఖ్యమంత్రి గారితో మాట్లాడి నా తర్వాత అవసరమైతే రైతులకు సబ్సిడీ మీద ఎలక్ట్రికల్ ట్రాక్టర్స్ ఇప్పించే ఏర్పాటు చేస్తామని డాక్టర్ రైతులకే కాకుండా మున్సిపాలిటీల్లో మండలాలలో గ్రామాలలో పంచాయతీల తరఫున వాడుకోవటానికి చాలా ఉపయోగకరంగా ఉందని తెలియజేశారు ఈ ఎలక్ట్రికల్ ట్రాక్టర్స్ పై రైతులకు అవగాహన ఏర్పాటు చేయాలని ప్రస్తుతం నడుస్తున్న ట్రాక్టర్ తో పోలిస్తే ఈ ట్రాక్టర్ల వల్ల రైతులకు 70% ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గుంటూరు టౌన్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, కంపెనీ సీఈవో. హరిచంద్ర ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## నార్పల మండల వాసులకు తప్పని తిప్పలు.







నార్పల(జనం రిపోర్టర్ ):.. అవసరం లేని చోట ఆర్టీసీ బస్టాండ్..గాంధీ సర్కిల్ లో కనీసం బస్సు షెల్టర్ కూడా కరువేనా...నార్పల మండల ప్రజలకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రం నుండి వివిధ గ్రామాలకు వెళ్లడంతో పాటు అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం వంటి పట్టణాలకు కూడా ఆర్టీసీ బస్సులు సౌకర్యం కలదు. అయితే ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులకు,ప్రజలకు అవసరం లేని చోట నిర్మించి,అవసరం ఉన్న చోట గాంధీ సర్కిల్లో కనీసం ప్రయాణికులు నిలవడానికి కూడా నీడలేని పరిస్థితి దాపురించింది. బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులతో పాటు ప్రజలు, వ్యాపారస్తులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్యపై కొంతమంది నాయకులు ఇప్పటికే అనంతపురం జిల్లా కలెక్టర్ దృష్టి కూడా తీసుకెళ్లడం జరిగింది.ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నార్పల గాంధీ సర్కిల్లో కనీసం బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు మండల ప్రజలు కోరుతున్నారు.

## విజ్ఞాన్స్‌లో ఘనంగా ముగిసిన కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్







పొన్నూరు (జనం రిపోర్టర్ ):విద్యార్థుల సామర్థ్యాలను ప్రపంచ స్థాయికి తీసుకువచ్చి ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని హైదరాబాద్‌లోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ స్టడీస్ (ఎస్ఈఎస్) చైర్‌పర్సన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రితేష్ ఖున్యాకరి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని అకాడమీ ఫర్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, డీన్ పీసీఎఫ్, డీన్ ఏఏఏ, డీన్ ఐక్యూఏసీ, టిస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో "కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ ఆన్ హార్నెస్సింగ్ ద సైన్స్, టెక్నాలజీ అండ్ సొసైటీ రిలేషన్‌షిప్ ఫర్ మీనింగ్‌ఫుల్ హయ్యర్ ఎడ్యుకేషన్" అనే అంశంపై 3 రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆదివారం ఘనంగా ముగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని టిస్ %-% ఎస్ఈఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ రితేష్ ఖున్యాకరి మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ మరియు సమాజం మధ్య సంబంధాన్ని సులభంగా అర్థం చేసుకోవడమే కాకుండా, ఇది ఉన్నత విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రామాణికమైన మార్పులకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. ఆధునిక సాంకేతికత, పరిష్కారాలు మరియు విద్యా విధానాలు సమాజాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయో, అవి విద్యార్థుల కోసం మరింత సమర్థవంతమైన, జ్ఞానంతో కూడిన ఉన్నత విద్యా విధానాలను రూపకల్పన చేయడానికి ఎలా ఉపయోగపడతాయో వివరించారు. ఈ వర్క్‌షాప్ సమాజంలో విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం యొక్క విస్తృత ప్రయోజనాలను వివరించడం, విద్యార్థులలో ఆలోచనా శక్తిని పెంచడం, అలాగే పరిశోధనా వాతావరణాన్ని మెరుగుపరచడం ద్వారా విద్యా రంగంలో నూతన మార్పులను ఆవిష్కరించడానికి ఉపయోగపడుతుందన్నారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాల రూపకల్పన జరగాలన్నారు. సమాజానికి అవసరమైన నైపుణ్యాలు, టెక్నాలజీ సంబంధిత మార్పులను అధ్యాపకులు ఎప్పటికప్పుడు గుర్తించాలన్నారు. ఉన్నత విద్యలో తరగతులు, కోర్సులు, రీసెర్చ్ కార్యక్రమాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా దగ్గర చేయాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలన్నారు. విజ్ఞానశాస్త్రం, సాంకేతికత మరియు ఆవిష్కరణల ద్వారా మాత్రమే సామాజిక సమస్యలకు పరిష్కారాలను చూపెట్టగలమన్నారు. విద్యా సంస్థలు, పరిశ్రమలు మరియు ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం తీసుకురావాలన్నారు. విద్యార్థులకు, శాస్త్రవేత్తలకు సామాజిక అంశాలను పరిష్కరించడంలో శాస్త్ర విధానాలు ఎలా ఉపయోగపడతాయో నేర్పడం చాలా ముఖ్యమన్నారు. వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించేందుకు శాస్త్ర సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. సమాజంలోని వివిధ వర్గాలను విద్యారంగంలో భాగస్వామ్యం చేయడం, సైన్స్ టెక్నాలజీ ప్రయోజనాలు సామాన్య ప్రజలకు ఎలా ఉపయోగపడతాయో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ముగింపు కార్యక్రమంలో హైదరాబాద్‌లోని టిస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్జున్ సేన్‌గుప్త, ముంబాయిలోని టిస్ సీనియర్ రీసెర్చ్ కోఆర్డినేటర్ డాక్టర్ రఫిఖ్ షేక్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఏఎఫ్‌డీ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ.



పొన్నూరు (జనం రిపోర్టర్ ):గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయములో ఆదివారం అఖిఆదివారంయువజన సమైఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభలు సందర్భంగా గోడ పత్రిక ఆవిష్కరణ జరిగినది. ఈ కార్యక్రమానికి పొన్నూరు నియోజవర్గ ఏఐవైఎఫ్ అధ్యక్షులు పరిస రాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర యువజన సమైక్య ఏఐవైఎఫ్ మహాసభలు ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళం లో జరుగుతాయని అన్నారు. ఈ మహాసభలకు జిల్లాలోని యువజన సమైక్య సభ్యులందరూ హాజరై మహాసభలను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యువతకు పెద్దపేట వేస్తామని రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మ పలికి అధికారంలోకి బిజెపి ప్రభుత్వం రావడం జరిగిందన్నారు . ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ఇస్తారని నిరుద్యోగ భృతి కల్పిస్తామని ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి రాగానే యువకుల్ని మరింత మోసం చేసే విధంగా ఉన్నాయని ఇప్పటివరకు ఒక ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణమే పెండింగ్ లో ఉన్న ఉద్యోగాలు మొత్తం భర్తీ చేసి తక్షణమే నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిల భారత యువజన సమైఖ్య ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు చేపట్టి సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పోరాడుతామన్నారు .ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గుంటూరు జిల్లా కార్యదర్శి అరేటి రామారావు, యువజన నాయకులు పొనుగుపాటి మురళీకృష్ణ, నిమ్మకాయల దుర్గాప్రసాద్,నిమ్మకాయల చైతన్య,రాజు,గణేష్, గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ ప్రత్యేక క్యాంపులు

నార్పల,(జనం రిపోర్టర్ ):అనంతపురం : జిల్లాలో అన్ని మండలాలు మరియు మున్సిపాలిటీలో జనవరి నెల కు సంబంధించి ఆధార్ క్యాంపులు జనవరి నెల 21వ తారీకు నుంచి 30వ తారీకు వరకు అన్ని మండలాలలో ఆధార్ క్యాంపులు కండక్ట్ చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ , ఆదేశాలు జారీ చేశారు. దానికి అనుగుణంగా అనంతపురం జిల్లాలో ప్రతి మండలము ప్రతి మున్సిపాలిటీ నందు ఆధార్ క్యాంపుకు సంబంధించి షెడ్యూల్ వేయడం జరిగినది. గ్రామ వార్డు సచివాలయాలలో ఆధార్ సేవా కేంద్రాలు నిర్వహిస్తున్నటువంటి కార్యదర్శులు మరియు కామన్ సర్వీస్ సెంటర్ కలిపి షెడ్యూల్ వేయడం జరిగినది. మండలాలుమరియు మున్సిపాలిటీలో ఏ ఆధార్కిట్లయితే వర్క్ అవుతున్నాయో వాటికి మాత్రమే షెడ్యూల్ ఇవ్వడం జరిగినది. అదేవిధంగా అంగడివాని సెంటర్ నందు ఆధార్ క్యాంప్స్ కండక్ట్ చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగినది. అంగన్వాడి సెంటర్ నందు క్యాంపు నిర్వహించడానికి అనుగుణంగా లేకపోతే దగ్గరలో ఉన్నటువంటి గ్రామ వార్డు సచివాలయాలలో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పైన ఇచ్చినటువంటి %స్త్రశీశీస్త్రశ్రీవ% షీట్ నందు కేవలం మ్యాపింగ్ మాత్రమే చేయడం జరిగినది. మండల్ లెవల్లో మీటింగ్ జరిగిన తర్వాత ఏ రోజు ఎక్కడ క్యాంపు కండక్ట్ చేయాలో డేట్స్ మండల స్థాయి అధికారులు అప్డేట్ చేసుకోవాలి. ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ కు చెందినటువంటి సిడిపిఓలు, సూపర్వైజర్లు. గ్రామ వార్డు సచివాలయంలో ఆధార్ సేవా కేంద్రాలు నిర్వహిస్తున్నటువంటి కార్యదర్శులు, వీఎల్ఈలు ఒక కోఆర్డినేషన్ మీటింగ్ కండెక్ట్ చేసేసి డేట్స్ గూగుల్ సీట్ నందు అప్డేట్ చేయవలెను.గూగుల్ సీట్ నందు మరియు సిఎస్సి డిపార్ట్మెంట్ కు చెందినటువంటి కాంటాక్ట్ నెంబర్స్ కూడా అప్డేట్ ఇవ్వడం జరిగినది. డేట్స్ అప్డేట్ అయిన తర్వాత మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు స్టార్ట్ చేయవలెను. ప్రతి పిల్లవాడికి రిమార్క్స్ కచ్చితంగా మెన్షన్ చేయాలి. మీకు ఏవైనా సమస్యలు ఉంటే ఆధార్ డిస్టిక్ కోఆర్డినేటర్ ,ని కాంటాక్ట్ ఇవ్వవలెను. ధన్యవాదములుగ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి. అనంతపురం జిల్లా.

# పశువైద్య శిబిరాన్ని, నిర్వహించబడును

నార్పల,(జనం రిపోర్టర్ ):బుక్కరాయ సముద్రం ప్రాంతీయ పశు వైద్య శాల పరిధి లోని బుక్కరాయ సముద్రం మరియు నార్పల మండలాల్లో రేపటి నుండి అనగా 20.01.2025 వ తేది నుండి 31.01.2025 వరకు వివిధ గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించబడును. ఈ శిబిరాల్లో అన్ని పశువులకు దూడలకు గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందులు ఇవ్వబడును. ఇలా నట్టాల నివారణ మందులు త్రాపించడం వలన పశువుల పొట్టలోని ఎలిక పాములు జలగలు నశించి పశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి అన్ని పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే జబ్బు చేసిన పశువులకు చికిత్స చేయబడును. నార్పల మండలాలలో ఈ క్రింద తెలిపిన తేదీల ప్రకారం మా సిబ్బంది గ్రామాల్లో పర్యటించి శిబిరాలను నిర్వహిస్తారు. కనుక గ్రామాల్లో సర్పంచ్ లు, ఎంపీటీసీ జడ్పీటీసీ ఇతర ప్రజా ప్రతినిధులు రైతులు నాయకులు పాల్గొని శిబిరాలను జయప్రదం చేయవలసింది గా కోరడమైనది.నార్పల మండలం లో 20 వ తేదిన చామలూరు బొందలవాడ, 21 న నిలువురాయి, సిద్దరచెర్ల, 22 న నడిమిదొడ్డి దుర్గం, 23 న గడ్డంనగేపల్లి బండ్లపల్లి, 24 న కేసేపల్లి నల్లపరెడ్డి పల్లి, 25 న నాయన పల్లి, . సోదనపల్లి, 26 న సుల్తాన్ పేట పప్పూర్, 27 న పులసనూతల మంగపట్నం, 28 న దుగుమర్రి గుంజేపల్లి, 29 న గూగుడు గొల్లపల్లి, 30 న రంగాపురం, గంగనపల్లి 31 న నార్పల తుంపెర గ్రామాల్లో శిబిరాలను నిర్వహించ బడును. ఈ అవకాశాన్ని నార్పల మండలాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవలసింది గా కోరడమైనది - డా. ఏ వి రత్న కుమార్, సహయ సంచాలకులు, ప్రాంతీయ పశు వైద్య శాల, బుక్కరాయసముద్రం మరియు . కే గోవింద రాజు పశువైద్యాధాధికారి నార్పల.



# ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతి

పీవీ పాలెం(జనం రిపోర్టర్ ):ట్రాక్టర్ ట్రాలీ కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది.చందోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిపాలెం నుండి భవనం వారి పాలెం వైపు టీవీస్ పై వెళ్తున్న కొండవీటి వెంకటప్రసాద్ అదే రూట్ లో వెళుతున్న ట్రాక్టర్ తగిలి క్రింద పడటం వలన ట్రక్కు వెనుక చక్రాల క్రింద పడి మృతి చెందాడు. చందోలు ఎస్ఐ ఎస్సై ఎస్ .శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ చొరవతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు నిధులు




రేపల్లె (జనం రిపోర్టర్ ):డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతోనే విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్రం నిధులు మంజూరు చేసిందని జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ వ్యాఖ్యానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి ఆంధ్రులు సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ గతంలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ ఉక్కుఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఆంధ్రులు 32 మంది బలిదానాలను, త్యాగాలను స్మరించుకోవాలనని మహేష్ అన్నారు. రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు రాష్ట్రంలో కూటమిని ఏర్పాటు చేశారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్రం రూ.11,440 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి ఎంతో ఉందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లో పనిచేస్తున్న ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పవన్ కళ్యాణ్ చేసిన కృషి అమోఘమని కొనియాడారు. 23 మంది పార్లమెంటు సభ్యులు , 151 మంది ఎమ్మెల్యేలు ఉండి కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి వణికిపోయారని ఎద్దేవా చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్రం నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ.., పవన్ కళ్యాణ్ కృషి, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మలిశెట్టి సాయి, షేక్ అక్రమ్, అల్లంశెట్టి గోవర్ధన్, బచ్చు సాయి,పరిశా పవన్ కళ్యాణ్ రేపల్లె రవి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంరక్షణకు ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి



రేపల్లె (జనం రిపోర్టర్ ):వృద్ధుల సంరక్షణకు పట్టణంలో ట్రిబ్యునల్ ఏర్పాటు చెయ్యాలని పట్టణ అభివృద్ధి సంఘం కార్యదర్శి సివి మోహన్ రావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై, మానవ సంబంధాలకు విలువ లేకుండా పోతుందన్నారు. కన్నబిడ్డలు కర్కశంగా ఉండి, జన్మనిచ్చిన వారిని వదలించుకోవాలని, కనీస అవసరాలు తీర్చకుండా నిరాదరణకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తి పంపకాలు చేశాక, పెద్దవారిని శారీరకంగా, మానసికంగా హింసిస్తు కన్న బిడ్డలే బయటకు గెంటేస్తున్నారని చెప్పారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఆర్థిక, ఆరోగ్య రక్షణ, ఆస్తుల భద్రత కోసం ఉచితంగా న్యాయము అందించడం కోసము, తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం 2007 లో అమలులోనికి తెచ్చిందని గుర్తు చేశారు. దీనికి 2011లో రాష్ట్ర ప్రభుత్వము, 2019 లో కేంద్ర ప్రభుత్వము సవరణలు చేసి, వృద్ధుల సంరక్షణ, పోషణ బాధ్యత వారి కుమారులు, కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్ళదే అని స్పష్టం చేశారు. ఈ చట్టం ద్వారా వృద్ధ తల్లిదండ్రులను పట్టించుకోని వారిపై చర్యలు తీసుకునే వీలుంటుంది అన్నారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు పరిచేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన అప్పిలేట్ ట్రిబ్యునల్ ను, డివిజన్ స్థాయిలో ఆర్డీవో అధ్యక్షతన ట్రిబ్యునన్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిస్సహాయ స్థితిలోఉన్న వృద్దులు పూర్తి వివరాలతో ట్రిబ్యునల్ కు దరఖాస్తు చేసుకుంటే, 90 రోజులలో వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి చట్టాన్ని తీసుకొచ్చిన విషయం జిల్లా స్థాయిలో వృద్ధులకు తెలియకపోవటం విచారకరమన్నారు. ప్రభుత్వ అధికారులు ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ ఇంకా ఏర్పడి దాదాపు 30 నెలల గడుస్తున్న పట్టణంలో ఇంతవరకు సదరు ట్రిబ్యునల్ ఏర్పాటు చేయలేదని చెప్పారు. వెంటనే వృద్ధుల సంరక్షణ చట్టం 2007 ప్రకారం పట్టణంలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ వెంకట మురళిని, ఆర్డీవో రామలక్ష్మిని కోరినట్లు తెలిపారు.

# అమరచింత నియోజకవర్గాన్ని తిరిగి సాధించుకుందాం

## డి ఎం ఆర్ ఎం పాఠశాలలో అఖిలపక్ష పార్టీల సమావేశం

### హాజరైన హైకోర్టు సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాష్ రెడ్డి, టీటీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త మహంకాళి శ్రీనివాసులు



వనపర్తి జిల్లా ప్రతినిధి/అమరచింత (జనం రిపోర్టర్ ):సుదీర్ఘ కాలం పాటు నియోజకవర్గంగా అమరచింత సేవలు అందించిందని 2009లో అనివార్య కారణాలవల్ల నియోజకవర్గం కోల్పోయామని తిరిగి నియోజకవర్గాన్ని సాధించుకుందామని ఆదివారం అమరచింత పట్టణంలోని దేశాయి మురళీధర్ రెడ్డి ప్రాథమిక పాఠశాలలో నియోజకవర్గ సాధన సమితి సభ్యులు, అఖిలపక్ష పార్టీల నాయకులు, విద్యావంతులు, కౌన్సిలర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సమావేశమయ్యారు. ఈ సమావేశానికి రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్, హైకోర్టు సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాశ్ రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త మహంకాళి శ్రీనివాసులు హాజరయ్యారు. మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు రాజకీయ పార్టీల నాయకులు విద్యావంతులు, కౌన్సిలర్లు అమరచింత





నియోజకవర్గ పూర్వ వైభవం గురించి అలాగే ఏ పరిస్థితుల్లో అమరచింత నియోజకవర్గం తిరిగి కావాలని ఎందుకు అడగాల్సిన పరిస్థితులు వచ్చాయో స్పష్టంగా తమ అ బి ప్రాయాలను పంచుకున్నారు. అనంతరం టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్ మాట్లాడుతూ అమరచింత వాసిగా ఈ నియోజకవర్గాన్ని కోల్పోవడం బాధాకరమని ఆయన అన్నారు. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో తమ పార్టీ దృష్టికి తీసుకెళ్లి అమరచింతను మళ్లీ నియోజకవర్గంగా తెచ్చుకునేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సహకారంతో త్వరలో అమరచింత విశేషాన్ని తెలిపి, అలాగే అమర చింత నియోజకవర్గం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుస్తామని హామీ ఇచ్చారు.

## అమరచింత ఆత్మకూరు రెండు అభివృద్ధి చెందాలి

## దేశాయి ప్రకాష్ రెడ్డి

అమరచింత ఆత్మకూరు మండలాలు రెండు జంట నగరాల లాంటివని దేశాయి ప్రకాష్ రెడ్డి అన్నారు. 1268లో అమరచింత సంస్థానం ఏర్పడిందని అప్పటినుండి అమరచింతకు ఒక చరిత్ర ఉందని అన్నారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం అమరచింత ప్రజలు తను పూర్తిగా సహకారం అందిస్తామన్నారు. అట్లాగే అమరచింత నియోజకవర్గానికి ఆత్మకూరు ప్రజలు సహకారం అందించాలని తద్వారా ఈ రెండు మండలాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిజెపి, సిపిఎం, సిపిఐ, బీఆర్ఎస్ ,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు అరుణ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జిఎస్ గోపి, ఎం. రాజు క్యామ, భాస్కర్ బి. వెంకటేష్ ,అక్కల నరసింహులు గౌడ్, మాజీ ఎంపీటీసీలు తిరుమలేష్, మహంకాళి విష్ణు, నాగభూషణం గౌడ్, రవీందర్, శ్యాంసుందర్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు కే రాజన్న కౌన్సిలర్లు సింధు, మంగ లావణ్య, రాజ్ కుమార్, తోపాటు మాజీ ప్రజా ప్రతినిధులు న్యాయవాదులు విద్యావంతులు రిటైర్డ్ ఉపాధ్యాయులు వర్తక వ్యాపార సంఘం సభ్యుల తోపాటు యువకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీనియర్ క్రిమినల్ అడ్వకేట్ వీరవల్లి బసవయ్య మృతి



రేపల్లె (జనం రిపోర్టర్ ): భారతీయ జనతా పార్టీ సీనియర్ లీడర్ మరియు సీనియర్ క్రిమినల్ అడ్వకేట్ గారు వీరవల్లి బసవయ్య మృతి బాధాకరమని బిజెపి నాయకులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ సందర్భంగా బిజెపి నాయకులు సత్యసాయిబాబా మాట్లాడుతూ బసవయ్య మృతి బిజెపి పార్టీకి తీరని లోటన్న గతంలో గతంలో ఎం ఎల్ ఏ గా భారతీయ జనతా పార్టీ తరఫున రేపల్లె అసెంబ్లీకి పోటీ చేశారు, భారతీయ జనతా పార్టీలో అనేకమైన కీలక పదవులు చేశారు, ఆయనకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తో అనుబంధం ఉన్న దన్నారు, ఆయన అకాల మరణానికి రేపల్లె భారతీయ జనతా పార్టీ రేపల్లె పట్టణ బిజెపి కార్యాలయంలో ప్రగాఢ సానుభూతి తెలియపరచడం జరిగింది. అన్నం సాయి సురేష్ కిషోర్ రామరాజు కృష్ణ ప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వి ఎచ్ ఆర్ ఫౌండేషన్ ఫౌండర్, బిఆర్ఎస్ నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి....



రామగుండం(జనం రిపోర్టర్ ):రామగుండం:జనవరి 19. రామగుండం నియోజకవర్గం 40వ. డివిజన్, గాంధీనగర్ పరిధిలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్త బండారి సంతోష్, కుటుంబానికి భవిష్యత్తులో వారి పిల్లల చదువుకు అండగా ఉంటానని వ్యాల్ల హరీష్ రెడ్డి ప్రకటించారు, అన్నట్టుగానే ఈ సంవత్సరం వాల్ల చదువు నిమిత్తం 30000/- రూపాయల ఆర్థిక సాయన్ని ఆదివారం చెర్ వి ఎచ్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ 40వ. డివిజన్ అధ్యక్షులు చల్లా రవీందర్ రెడ్డి చేతుల మీదుగా మృతుడు బండారి సంతోష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా చల్లా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు భరోసానిస్తూ, వెంటనే స్పందిస్తూ, ఎంతటి సాయన్నైన చేయడానికి ముందుకు వస్తున్న ఫౌండేషన్ ఫౌండర్ హరీష్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ, అదేవిధంగా రామగుండం నియోజకవర్గంలో బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలకు గానీ పేద ప్రజలకు కానీ రానున్న రోజుల్లో, ఏ కష్టం ఉన్న హరీష్ రెడ్డి ముందుంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 40వ. డివిజన్ ప్రజలందరి తరఫున హరీష్ రెడ్డికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వి ఎచ్ ఆర్ ఫౌండేషన్ 40వ. డివిజన్ ఇంచార్జ్ సిగిరి తిరుపతి తో పాటు, ఫౌండేషన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అదేవిధంగా కాలనీవాసులు పాల్గొన్నారు.

# సర్వే పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి.



వరంగల్ (జనం రిపోర్టర్ ): అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు .ఆదివారం నల్లబెల్లి మండలంలోని నందిగామ, రంగపురం గ్రామంలో ఆత్మీయ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, సర్వేను పరిశీలించి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు 6000 చొప్పున రెండు విడుదలగా 12000 భూభారతి పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందని అలాగే ఇల్లు, కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు రియల్ ఎస్టేట్ భూముల్లో, లేఅవుట్ చేసిన భూములో ,నాల కన్వర్షన్ చేసిన భూములు,



మైనింగ్ చేస్తున్న భూములు తొలగించాలని సూచించారు. ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా రేషన్ కార్డులో కొత్త సభ్యులను జతపరచడానికి కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకొని జాబితాలో పేరురానివారు అర్హుల వివరాలను కూడా నిర్దేశిత పట్టికలో నమోదు చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు



ఇంకేమైనా సమస్యలు ఉంటే వాటిని కూడా గ్రామసభ ద్వారా సమస్యను పరిష్కరించాలన్నారు.మండలంలోని పలు గ్రామాల్లో సర్వే తీరును పర్యవేక్షించి లబ్ధిదారుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఖచ్చితమైన సమాచారన్ని నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ముప్పు కృష్ణ ,మండల స్పెషల్ ఆఫీసర్ సిపిఓ గోవింద రాజన్, ఎంపీడీవో నరసింహ మూర్తి, ఏపీవో పంజా వెంకట నారాయణ,ఏ ఓ ,ఎం పి ఓ, పంచాయతీ కార్యదర్శి వద్ది రాజు ,ఏఈఓ శ్రీకాంత్ రెడ్డి గ్రామపంచాయతీ సిబ్బంది ,రెవెన్యూ సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కి ఆర్థిక సహాయం చేసిన ముదిరాజ్ సంఘం





వెల్గటూర్ (జనం రిపోర్టర్ ):వెల్గటూర్ మండలం శాఖపూర్ గ్రామంలోని మీరాల కార్తీక్ అను వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతని కాలి వేలు మరియు కంటి బొక్క విరుగగా అతని యొక్క ఆర్థిక పరిస్థితి బాగా లేనందున అతని పరిస్థితి తెలుసుకొని కార్తీక్ తల్లిదండ్రులకు ముదిరాజ్ సంఘ సభ్యులు వారికి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం 20,000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. కార్తీక్ తల్లిదండ్రులు ముదిరాజ్ సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొలకాని సత్తయ్య, కొలకాని పోచయ్య, రంగం మధు, మీరాల రమేష్,మడిగేలా రవి, లచ్చయ్య, గౌరయ్య, శ్రీనివాస్, రాజయ్య, రాయాలింగు,మల్లేష్, రాజు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికులకు ట్రాఫిక్ అవగాహన సదస్సు.....

## రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత...

## హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి...

## ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్...



రామగుండం:(జనం రిపోర్టర్ ):రామగుండం:జనవరి 19. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో పెద్దపల్లి హమాలీ కార్మిక సంఘం భవనం, రైల్వే స్టేషన్ ఆవరణ లో ట్రాఫిక్ రూల్స్, రాష్ డ్రైవింగ్, త్రీబుల్ రైడింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్, వాహన ధ్రువీకరణ పత్రాల ఉపయోగం పై అవగాహనా కల్పించారు.ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.... ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి, అదేవిధంగా తమ వెహికల్ కి ఇన్సూరెన్స్ తీసుకొని ఉండాలి, మద్యం సేవించి వాహనాలు నడపరాదు, అతివేగంగా అజాగ్రత్తగా సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదు. వాహనాలు నడిపినప్పుడు అందరూ సీట్ బెల్ట్ ధరించి ఉండాలి, ప్రతి ఒక్కరూ కుటుంబం పట్ల సమాజం పట్ల బాధ్యతగా ఉండి డ్రైవింగ్ చేయాలి, తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించాలి. అలాగే ఎవరైనా రోడ్డు ప్రమాదాల బారిన పడితే వారి సమాచారం పోలీసు వారికి, 108 కి అందించి, ఇంకా వారిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించడంలో సహాయపడాలి, మన నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సంఘ కార్యదర్శి , సంపత్,ఆర్ ఎస్ ఐ రవికాంత్ పాల్గొన్నారు.



జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక



# ఘనంగా వనితే ఓబవ్వ జయంతిఉత్సవాలు



గుడబండ (జనం రిపోర్టర్ ): మండలంలోని, మందలపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఓబవ్వ జయంతి కార్యక్రమానికి ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి వైటి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులకు ఉరాలు మోగిస్తూ గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు ఎం.ఎస్.రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి కూడా కాసేపు ఉరాలు మోగించి కళాకారులను ఉత్సాహపరిచారువనికే ఓబవ్వ ధీరత్వానికి ప్రతీకగా విగ్రహం ఏర్పాటుఉరాల కళాకారులకు పెన్షన్ అంశం సీఎం దృష్టికిసీసీ రోడ్లు లేని దళిత



కాలనీలు ఉండకూడదు ఓబవ్వ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు వ్యాఖ్య చిత్రదుర్గ కోట సామంతరాజుల రాజ్యాన్ని శత్రు సైన్యం నుండి కాపాడేందుకు వీరోచిత పోరాటాన్ని చేసిన వీరవనిత ఓబవ్వ ధైర్యసాహసాలు కొనియాడదగినవి అని, ఓబవ్వ పోరాట పటిమ భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ పల్నాడు సైన్యాధ్యక్షుడు మాల వీర కన్నమదాసు, ఒబవ్వ వంటి పోరాట వీరుల చరిత్రను తెలియజేసేందుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఒబవ్వ జయంతి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. డప్పు కళాకారులకు ప్రతినెల పెన్షన్ వస్తున్న విధంగా ఉరాలు మోగించే మాల కళాకారులకు కూడా పెన్షన్ ఇప్పించే విషయాన్ని ముఖ్యమంత్రివర్యులు దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ఏ దళిత కాలనీ సీసీ రోడ్లు లేకుండా ఉండకూడదని, సీసీ రోడ్లు లేని ప్రాంతాల్లో త్వరితగతిన రోడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దళిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు, మంచినీటి వ్యవస్థ, పాఠశాలలు అన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్ మరియు డైరెక్టర్ కమలమ్మ, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ మంజునాథ్ మండల కన్వీనర్ మాల తాలూకా అధ్యక్షులు పాండురంగప్ప, బసవరాజు, బుడ్డన్నగారి సోము,మండల కన్వీనర్లు మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ,కాచికుంట వెంకటేష్,అగలి వెంకటస్వామి, బసవరాజు తదితర మాల సోదరులు పాల్గొన్నారు

# అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టలేరు -ఖబర్దార్ బీఆర్ఎస్ నాయకులారా

## ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ, పేదలకు అండగా నిలుస్తుంది కాంగ్రెస్ పార్టీ -పెండెం రామానంద్



వరంగల్ (జనం రిపోర్టర్ ): నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తూ చదును చేయడం జరిగింది ఇట్టి విషయం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి రాగా వారి సూచనల మేరకు నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని రాజేందర్ ఆధ్వర్యంలో టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ ఓబీసీ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఓర్సు తిరుపతి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు ముఖ్య నాయకులు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఆవరణను ఆదివారం నాడు సందర్శించడం జరిగింది. నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పెండెం రామానంద్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేయని అరాచకం లేదు. ముఖ్యంగా నర్సంపేట నియోజకవర్గం మరియు పట్టణంలో భూ దందాలు రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ మరియు ప్రైవేటు వ్యక్తుల భూములను ఆక్రమించుకున్న చరిత్ర బీఆర్ఎస్ నాయకులది అని అన్నారు. పట్టణంలోని పాకాల రోడ్డు మరియు మల్లంపల్లి రోడ్డు అదే విధంగా నెక్కొండ రోడ్డుకు గల అసైన్డ్ భూములను ఆక్రమించుకున్న బీఆర్ఎస్ నాయకుల్లారా ఖబర్దార్ గత పది




సంవత్సరాల క్రితం మీ ఆర్థిక పరిస్థితులు ఏమిటి ప్రస్తుతం మీ ఆర్థిక పరిస్థితులు ఏమిటి అనేది నర్సంపేట ప్రజలు గమనిస్తున్నారు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు అని అన్నారు. నర్సంపేట రాజకీయ చరిత్రను పరిశీలిస్తే పెద్దలు కీర్తిశేషులు పెండెం కట్టయ్య గారు కాంగ్రెస్ పార్టీకి 60 సంవత్సరాలు పేద ప్రజల అభివృద్ధి తన ఊపిరిగా రాజకీయం చేసిన చరిత్ర మా కుటుంబానిది అని అన్నారు సొంత ఆస్తులను అమ్ముకొని ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్న చరిత్ర మా తాతయ్య పెండెం కట్టయ్య గారిదని స్థాయికి మించి విమర్శలు చేస్తే భవిష్యత్తులో తగిన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.నర్సంపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములను కాపాడుతూ పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే కాంగ్రెస్ పార్టీ నాయకుల లక్ష్యంమని అదే గత ప్రభుత్వ బీఆర్ఎస్ నాయకులు పేద ప్రజల భూములను ప్రభుత్వ భూములను ఆక్రమించి కోట్ల రూపాయలు గడించిన టిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదు అని అన్నారు. నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన భూమిని ఎట్టి పరిస్థితులలో అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మీడియా మిత్రుల ద్వారా కోరాడం జరుగుతుందని వారు మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ కౌన్సిలర్లు ఎలకంటి విజయ్ కుమార్, ములుకల వినోద-సాంబయ్య, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పంబీ వంశీకృష్ణ, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శులు బిట్ల మనోహర్, జన్ను మురళీ, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ కార్యదర్శులు మోటం రవికుమార్, చిప్ప నాగ, మాజీ వార్డు సభ్యులు గాజుల రమేష్, బీరం భరత్ రెడ్డి, 8వ వార్డు అధ్యక్షులు గీరగాని రమేష్, 9వ వార్డు అధ్యక్షులు పిన్నింటి కిరణ్ కుమార్ రెడ్డి, 20వ వార్డు అధ్యక్షులు రామగోని శ్రీనివాస్, బీరం భాస్కర్ రెడ్డి, మంచినీళ్ల నాగరాజు, ఇస్లావత్ వీరన్న, ఎదరబోయిన రాజేందర్, మచ్చకంటి మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిసిన ఊరెళ్ళా మాజీ సర్పంచ్ మహమ్మద్ జహంగీర్ ..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి: చేవెళ్ల (జనం రిపోర్టర్ ): చేవెళ్ల మండల పరిధిలోని ఊరెళ్ళా మరియు దామరగిద్ద మాజీ సర్పంచులు అయినటువంటి మహమ్మద్ జహంగీర్,మల్లి పెద్ద వెంకటేశంలు ఆదివారం నాడు ఉదయం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సొంత గ్రామమైన చించల్పేట్ గ్రామం అయినటువంటి ఎమ్మెల్యే కాలే యాదయ్య సొంత గ్రామం అయినటువంటి చించల్పేట్ వెళ్లి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపిన శుభ సందర్భంగా వారు మాట్లాడుతూసంక్రాంతి పండుగ శుభ సందర్భంగా చేవెళ్లే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మకర సంక్రాంతి పండగ శుభ సందర్భంగా మీ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోని కాంగ్రెస్ కార్యకర్తలు



అభిమానులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్రామములో మకర సంక్రాంతి పండగకు నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంక్రాంతి పండుగకు ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆదేశాల మేరకు చేవెళ్ల నియోజకవర్గంలో లోని చేవెళ్ల, మొయినాబాద్,షాబాద్, శంకర్పల్లి, నవాబ్పేట్ మండల పరిధిలో వివిధ గ్రామంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో హాయిగా ఉండాలని ఎలాంటి గొడవలు ఇబ్బందులు కలగకుండా ఉన్నట్లయితే వాటిని సదురుకొని అందరూ హాయిగా ఉండాలని ఒకవేళ సమస్యలు తీరని ఎడల ఉన్నట్లయితే వాటిని వెంటనే తమకు సమాచారం ఆయన అన్నారు. ఒకవేళ సమస్యలు గొడవలు తీరని ఎడల వాటిని పరిష్కారం చేసే విధంగా మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించి గొడవల సమస్యలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేసే విధంగా చూడాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆదేశాలు జారీ చేశారు. చేవెళ్ల నియోజకవర్గం లోని ప్రజలందరూ సంక్రాంతి పండుగను మంచిగా జరుపుకున్నందున చేవెళ్ల మండల పరిధిలోని ఊరెళ్ళ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్,మహమ్మద్ జహంగీర్. దామరగిద్ద గ్రామానికి చెందిన మల్లీ పెద్ది వెంకటేశం గుప్త వారు ఇద్దరు కలిసి ఆదివారం ఉదయం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సొంత గ్రామం అయినటువంటి చించల్ పేట గ్రామానికి వెళ్లి ఎమ్మెల్యే కు తెలిపారు. నూతన సంవత్సర శు భాకాంక్షలు అభినందనలతో సంక్రాంతి పండుగకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శుభ సందర్భంగా నెక్స్ట్ వచ్చే పండుగలకు ఇదే విధమైన బంధ భక్తులను నిర్వహించి చేవెళ్ల నియోజకవర్గం లోని ప్రతి గ్రామంలోని ప్రజలందరూ హాయిగా ఉండి వచ్చే పండుగలను శుభ సందర్భంగా జరుపుకునే విధంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆదేశాలను జారీ చేయాలని ఊరెళ్ళ గ్రామ మాజీ సర్పంచ్ మహమ్మద్ జహంగీర్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గం

# బిజెపి పార్టీకి మహంకాళి శ్రీనివాసులు రాజీనామా రానున్న పురపాలిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ



వనపర్తి (ప్రతినిధి) అమరచింత(జనం రిపోర్టర్ ):భారతీయ జనతా పార్టీకి తాను రాజీనామా చేస్తున్నట్లు అమరచింత వాసి, ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకులు మహంకాళి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం అమరచింతలో జరిగిన నియోజకవర్గ సాధన సమితి సమావేశానికి ఆయన హాజరయ్యారు.ఈ నేపథ్యంలో తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహంకాళి శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఎన్నికల వరకు తాను బిజెపిలో పని చేసినట్లు తెలిపారు. ఆ పార్టీలో జరుగుతున్నటువంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఆ పార్టీకి దూరంగా ఉండదలచుకున్నానని తెలిపారు. బిజెపి పార్టీలో ఇమడలేకే తాను ఆ పార్టీకి ఆరు నెలలుగా దూరంగా ఉంటున్నానని తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా కమిటీ ఎన్నికల్లో కొందరు తన పేరు వాడుకుంటున్న దృష్ట్యా ఈ ప్రకటన చేస్తున్నట్లు తెలిపారు. తన స్వగ్రామమైన అమరచింతలో రాబోయే పురపాలిక ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానన్నారు. 7, 6 ,10 వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులను పోటీలో నిలబెడతానన్నారు. సరైన అభ్యర్థులు దొరికితే 10 వార్డుల్లో పోటీ చేస్తామని ఆయన అన్నారు.అమరచింత అభివృద్దే లక్ష్యంగా ఇకనుండి అమరచింతలో వారంలో రెండు సార్లు పర్యటిస్తానని తెలిపారు. మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం, పాలకవర్గంపై ఒత్తిడి తీసుకొస్తానని అన్నారు.

# కాళేశ్వరం జోన్ పరిధి పోలీసులకు క్రీడలను ప్రారంభించిన అడిషనల్ డీజీపీ అడ్మిన్ రాజు



రామగుండం:(జనం రిపోర్టర్ ): పెద్దపల్లి జిల్లా రామగుండం:జనవరి 19.గోదావరిఖనిలో తెలంగాణ రాష్ట్ర స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలు కోసం క్రీడాకారుల ఎంపికకై, కాళేశ్వరం జోన్ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలు, గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ మైదానంలో ఆదివారం రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు పోలీస్ అధికారులతో కలిసి ఘనంగా క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అడ్మిన్ డీసీపి మాట్లాడుతూ.. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం 24 7 విధినిర్వహణలో బిజీగా ఉన్నప్పటికీ, సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. ఆటల్లో గెలుపోటములనేవి సహజమన్నారు. గెలుపోటముల కంటే టీమ్ స్పిరిట్ గొప్పదన్నారు. క్రీడల్లో గెలుపు కంటే పాల్గొనడం, పార్టిసిపేషన్ ముఖ్యమన్నారు. ఎల్లప్పుడు విధినిర్వహణలో ఉంటారని, అలాంటి నిర్విరామ విధులలో ఉన్న పోలీసులకు స్పోర్ట్, గేమ్స్ అనేవి నూతన ఉత్సాహంతో పాటు ఉల్లాసాన్ని కలిగిస్తుందని, సిబ్బందికి ఎల్లప్పుడు పని ఒత్తిడి తట్టుకోవడానికి, శక్తిని ఇవ్వడానికి ఈ క్రీడలు ఎంతో



ఉపయోగపడుతాయని, ఈ క్రీడలు స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించు కోవాలని, గెలుపోటములను ఏదైనా స్ఫూర్తిగా తీసుకోవాలని ఇక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచి, కాళేశ్వరం జోన్ తరుపున రాష్ట్ర స్థాయిపోటీలలో పాల్గొని అక్కడ కూడా కాళేశ్వరం జోన్ కు అత్యధిక పతకాలు సాధించి, మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ పోటీలు రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీస్



టీమ్స్ మధ్య షటిల్ బ్యాట్మెంటన్, వాలీబాల్,కబడ్డీ, ఖో ఖో, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, స్విమ్మింగ్, తగ్గాఫర్, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, జవలిన్, అథెలిటిక్స్ క్రీడలు లలో సెలక్షన్ లు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ఏ ఆర్ ఏసీపీ లు ప్రతాప్, సుందర్ రావు, ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, వామన మూర్తి, మల్లేశం, సంపత్, ములుగు ఆర్ఐ సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా తయారుచేసే ఇటుక బట్టీలపై చర్యలు చేపట్టాలి



వరంగల్ (జనం రిపోర్టర్ ): నర్సంపేట పరిధిలో ఇటుక బట్టీల కోసం, సాగుచేసే సారవంతమైన పంట పొలాలను నిస్సారంగా మార్చిడం వలన, ఆహార కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండలంలోని ఎంతో సారవంతమైన పంట భూములను, ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుకలు తయారీ కోసం ఉపయోగించటం వల్ల భూమి సారం నశించి భూమి ఏ పంటకు ఉప యోగ పడద నీ, తద్వారా భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారం, ధనార్జనే ధ్యేయంగా జరుగుతున్న ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు తీసుకునే అవకాశం కూడా లేదనిపిస్తుంది. పంట పొలాలు, మామిడి తోటల మధ్య ఇలాంటి ఇటుక తయారీ బట్టీలను ఏర్పాటు చేయడం వల్ల బట్టీని కాల్చే సమయంలో వచ్చే పొగ వల్ల చుట్టుపక్కల ఉన్న పంటలు దెబ్బతింటునాయనీ, ఈ బట్టీలు ఆర్అండ్బి రహదారికి ఇరువైపులా అతి సమీపంలో ఉండటం వల్ల కూడా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.పొగవలన పొంచి ఉన్న పెనుప్రమాదంఈ ఇటుక తయారీ కేంద్రాలు ఊరుకి సమీపంలో ఉండటం వల్ల ఇటుకల తయారు కోసం నిల్వ ఉన్న బూడిద, వరిపొట్టు, పొగ వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ పొగ పీల్చిన వారికి ఆరోగ్య సమస్యలు వస్తాయని ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించి, అనుమతి లేకుండా, విచ్చల విడిగా పుట్టుకొస్తున్న ఇటుక బట్టీల వలన ప్రకతి కి విఘాతం కలిగించి, భవిష్యత్తులో విపత్తు కలిగించే విధంగా ఉన్న ఇటుక బట్టీల వారికి అధికారులు తగిన అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ఎంతో పచ్చగా ఉన్న పంట పొలాలు ఎడారిలా మారి ధాన్యంపు కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పుట్టగొడుగుల్లా ఏర్పాటు అవుతున్న ఇటుక బట్టీ తయారిని అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై త్వరలోనే ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టకపోతే పచ్చని పంట పొలాలు ఎడారిలా మారి ఆహార ధాన్యాల ఉత్పత్తి లేక కరువు ప్రాంతంగా మారే ప్రమాదం ఉంది. కనుక అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం 20 వ్యవస్థాపక దినోత్సవం లో పాల్గొన్న కేంద్ర హెూంశాఖ మంత్రి అమీషా...



విజయవాడ.(జనం రిపోర్టర్ ): విజయవాడ దగ్గర్లో ఉన్న కొండపావులూరు లో నిర్వహించిన ఎన్డీఆర్ ఎఫ్ 20వ వ్యవస్థాపక దినోత్సవం లో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు, నూతనంగా నిర్మించిన పదవ బెటాలియన్ ఎన్ ఐ డి ఎం ప్రాంగణాన్ని ప్రారంభించారు, విపత్తుల సమయంలో ఎలా ఎదుర్కోవాలో ఎన్ డి ఆర్ ఎఫ్ రూపొందించిన కార్యక్రమాన్ని తిలకించారు, ఆ తర్వాత తిరుపతి రీజినల్ ఫోరానిక్స్ సైన్స్ ల్యాబ్ వర్చువల్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత బహిరంగ సభలో పాల్గొని, మోడీ, చంద్రబాబు నేతృత్వంలో విజయం సాధించాం, ప్రకృతి విపత్తులను ఎన్డీఆర్ ముందుగా స్పందించి తన సహాయ సహకార అందిస్తుందని మానవులుసృష్టించిన విపత్తులు పట్ల ఎన్డీఏ స్పందిస్తుంది, రాత్రి పగలు పనిచేస్తూ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న చంద్రబాబు కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని, ఆరు నెలల కాలంలో ఏపీకి మూడు లక్షల కోట్లు కేటాయించామని , 14400 కోట్లు సపోర్ట్ చేశాము. మోడీ భూమి పూజ చేసిన అమరావతికి 27 వేల కోట్లు ప్రపంచ బ్యాంకు, హడకో నిధులు ఇచ్చేమని పేర్కొన్నారు. రైల్వే జోన్ రాష్ట్ర జీవనాడీ పోలవరానికి 2028నాటికి గోదావరి నీళ్లు రాష్ట్రనికి అందిస్తామని అన్నారు.

# భర్త చనిపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్నేహితురాలకు అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులు...





రామగుండం(జనం రిపోర్టర్ ): రామగుండం: జనవరి19.రామగుండం మండలం కాలనీలోని నివాసం ఉంటున్న హసీనా తన భర్త మరణించడంతో ఆమె ఆర్థిక ఇబ్బందులతో ఎదుర్కొంటుందని, తెలుసుకున్న తన చిన్ననాటి స్నేహితులు అందరూ కలిసి నగదు భాహు మతి 30 వేల రూపాయల ఆర్థిక సాయం హసీనకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది గడమల్ల వరలక్ష్మి, ఆకుల శైలజ, మహమ్మద్ అలీ, చిన్ననాటి మిత్రులు,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న..

రజాకర్లపై తిరగబడి పేదల ఆకలి తీర్చిన యోధుడు ఆ మహనీయుడు.. ఆయన స్ఫూర్తితో ముందుకు కదులుదాం..నీలం మధు ముదిరాజ్..మీర్ పెట్ లో పార్టీలకతీతంగా ఘనంగా పండగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ..నీలం కు ఘన స్వాగతం పలికిన నిర్వహకులు..బైక్ ర్యాలీలో పాల్గొన్న నీలం..



(జనం రిపోర్టర్ ): నిజాం రజాకర్లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల కడుపు నింపిన పోరాటయోధుడు తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న అని నీలం మధు ముదిరాజ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట్ లో ఏర్పాటు చేసిన పండగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ



కార్యక్రమంలో స్థానిక ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ గార్లతో కలిసి నీలం మధు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ పేద ప్రజలు ఆకలితో అలమటించకూడదని భూస్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడని కొనియాడారు. ఆకలితో అల్లాడుతున్న గ్రామాలలో పండగ సాయన్న అడుగు పెడితే వారి కడుపు నింపి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత వల్లే



సాయన్న కు పండగ సాయన్న అని పేరు వచ్చిందన్నారు.ముదిరాజ్ కులంలో పుట్టిన ఈ మహనీయుడు బంధుక్ ఎత్తి రజాకర్ల అన్యాయాలను ఎదిరించి ఎదురొడ్డి నిలిచి బహుజనులకు అండగా నిలిచాడని గుర్తు చేశారు.అలాంటి మహావీరుడు స్ఫూర్తితో మనమంతా ముందుకు కదలి పేదల పక్షాన నిలబడదామని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు రేఖ లక్ష్మణ్, పద్మ భాస్కర్, అందేలా శ్రీరాములు యాదవ్, షాద్నగర్ అందాబాబు, మిద్దెల సంతోష్,నిర్వాహకులు మీర్పేట్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పూలకారం శివశంకర్, జిల్లెలుగూడ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు అల్లగోని కుమార్, గొర్కె జగన్, యేడ్ల మల్లేష్, చింతల రాఘవేందర్, తుమ్మల రమేష్, బొమ్మ కంటి దయానంద్, నాయకులు, అధిక సంఖ్యలో హాజరైన ముదిరాజ్ సోదరులు తదితరులు..

## అర్హులందరికీ రేషన్ కార్డు గ్రామ సభల్లోనూ దరఖాస్తు తీసుకుంటాం..!!

### రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డు అందజేస్తామని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్ ): రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు రేషన్ కార్డు జారీకి సంబంధించి అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు కార్డులు అందజేస్తామని కలెక్టర్ అన్నారు.గ్రామ సభల్లో, వార్డుల్లో, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించిన వాటిని పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు జారీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలన ఫారములతో పాటు ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. కుటుంబంలో విభజన అయినవారు కొత్త కార్డు కావాలని తీసుకున్న దరఖాస్తును కూడా పరిశీలిస్తామన్నారు. గతంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని అన్నారు. ఇదివరకు ఎప్పుడూ దరఖాస్తు సమర్పించకపోయినా గ్రామాలు, వార్డుల్లోకి వచ్చే అధికారులకు ప్రజలు తమ దరఖాస్తులు ఇవ్వాలని ఆయన సూచించారు.ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుని ప్రజా పాలన ఆన్ లైన్ లో రాని వారు కూడా గ్రామ సభల్లో, ప్రజా పాలన సేవ కేంద్రాల్లో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

## మన గుడి - మన బాధ్యత కార్యక్రమం విజయవంతం



పెబ్బేరు (జనం రిపోర్టర్ ):పుర పట్టణ హిందూ బంధువుల సహాయ సహకారాలతో హిందూ జాగృత బృందం ఆధ్వర్యంలో విజయవంతంగా లిమన గుడి - మన బాధ్యత 23 వ వారం ఆదివారం పురస్కరించుకొని చౌడేశ్వరి దేవి జాతర పురస్కార కార్యక్రమం అలాగే చిన్న చౌడేశ్వరి దేవి దేవస్థానం ఆవరణ పరిశుభ్రత కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమంలో హిందూ జాగృతం సభ్యులు అలాగే హిందూ బంధువులు పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా చిన్న చౌడేశ్వరి గుడి దగ్గరికి వచ్చినటువంటి హిందూ జాగృతం సభ్యులకు ఉదయం అల్పాహారాన్ని అందించిన గోవర్ధన్ గారి (కిరణం) వారికి హిందూ జాగృతం తరపున ధన్యవాదములు తెలియజేశారు.



# సింగరేణిలో ఉన్నత స్థాయిలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి, కులం పేరుతో తిట్టి కొట్టిన, అతనికి వత్తాసు పలుకుతున్న సింగరేణి అధికారులు....

## దెబ్బలు తిన్నది, దళిత కార్మికుడని నిర్లక్ష్యమా...?



రామగుండం:(జనం రిపోర్టర్ ):రామగుండం:జనవరి 19. సింగరేణి ఆర్ జీ,వన్ పరిధిలోని 11 ఇంక్లైన్ బొగ్గు గనిలో పనిచేస్తున్న సర్దార్ అజయ్ ని, పిడుగుద్దు లు గుద్ది ఎస్సీ కులం పేరుతో తిట్టి నానా హింసలకు గురిచేసింది ఎవరో కాదు...ఈ మాటలు అన్నది ఎవరో అనాముకులు, అన్నవి కాదు.. సింగరేణిలో తన వద్ద సర్దార్ గా ఉద్యోగం చేస్తున్న కులానికి చెందిన అజయ్ ని తన పై ఆఫీసర్ హెడ్ ఓవర్ మాన్ గా విధులు నిర్వహిస్తున్న, శ్రీనివాసరావు అన్న మాటలు.. అనామకుడు, నిరక్షుడు, చదువురాని వాడు కాదు.. సింగరేణిలో ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తున్న శ్రీనివాసరావు మొదటి నుండి కార్మికుల పట్ల వివాద స్పదుడుగానే ఉంటారని, తనతో పని చేసే అధికారులు, తన వద్ద పని చేసే కార్మికులు కూడా చెప్తున్నారు. సింగరేణి ఆర్ జీ వన్, 11 ఇంక్లైన్లో గోదావరిఖని సర్దార్ గా విధులు నిర్వహిస్తున్న ఎస్సీ కులానికి చెందిన అజయ్ నీ, ఏ కారణం లేకుండానే చెప్పరాని బూతులు తిడుతూ, ఎస్సీ కులాలను కూడా అవమానిస్తూ బూతులు



తిడుతూ, అవమానపరుస్తున్న శ్రీనివాసరావుకు ఇతర కులాల అధికారుల, అండ కూడా పుష్కలంగానే ఉన్నట్టు తెలుస్తుంది.అందరి ముందే గళ్ళ పట్టి చెంపపై కొట్టి ఎస్సీ కులం పేరుతో నాన బూతులు తిడుతూ, బాడ్ కావు, లం....కొడకా రిజర్వేషన్ల మీద ఉద్యోగం సంపాదించినోడా అంటూ... ఏ కారణం లేకుండానే నానా బూతులు తిడుతూ పిడుగుద్దులు గుద్దితే, దాదాపు 5 రోజులు గడుస్తున్న ఇప్పటివరకు, సింగరేణి ఆర్ జీవన్ జనరల్ మేనేజర్ గాని, ఇతర ఉన్నత స్థాయి అధికారులు పరామర్శించేందుకు రాకపోవడం సింగరేణి అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట.. ఆర్ జీవన్ పరిధిలోని 11 ఇంక్లైన్ బొగ్గు గనిలో ఒక ఉద్యోగిని అందరి ముందే ఎస్సీ కులం పేరుతో నాన బూతులు తిడుతూ, పిడుగుద్దులు గుద్దితే, తన సంస్థలో సిన్సియర్ గా తలవంచుకొని పని చేస్తూ, తన ఉద్యోగ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న ఉద్యోగి కులం పేరుతో తిట్లు పడి, దెబ్బలు తిని ఐదు రోజులుగా సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే.. సింగరేణి వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సింగరేణిలో ఉండే కార్మిక సంఘాలతో పాటు, ఇతర దళిత సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పరామర్శిస్తూ వెళుతున్నారు. సింగరేణి ఉద్యోగి అజయ్ నీ తనపై అధికారి ఏ కారణం లేకుండానే కులం పేరుతో దూషిస్తూ, దురుసుగా ప్రవర్తించి కొట్టి తిట్టారన్న వార్త, సింగరేణి వ్యాప్తంగా కోడై కూస్తుంటే బాధితుడైన అజయ్ నీ కనీసం ఏమి జరిగిందో తెలుసుకోవడానికి కూడా ఆర్ జి ,వన్ జనరల్ మేనేజర్ రాకపోవడం ఎవరి పక్షాన ఉన్నాడో అర్థమవుతుంది. బాధితుల పక్షాన నిలబడి జరిగిన సంఘటనను నిష్పక్షపాతంగా తెలుసుకొని, చర్యలు తీసుకోవలసిన ఆర్జీవన్ జనరల్ మేనేజర్ బాధించిన వ్యక్తికి అండగా నిలుస్తున్నారు అన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయాన్ని ఈనెల 17వ. తేదీన సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, సింగరేణి వ్యాప్తంగా ఉన్న కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, ఆర్జి వన్ టూ త్రీ, మందమరి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి,భూపాలపల్లి కి చెందిన 50 మంది సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకత్వంలో కలిసి గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో బాధితున్ని పరామర్శించారు. ఇప్పటివరకు కూడా జిఎం కానీ ఇతర ఉన్నత అధికారులు కానీ రాలేదని తెలుసుకొని, జిఎం కి ఫోన్ చేస్తే వస్తున్నాను అని చెప్పి ఈరోజు వరకు కూడా బాధితున్ని పరామర్శించ లేదంటే ఏ మేరకు దళిత కార్మికుల పట్ల, వారి సమస్యల పట్ల జిఎంకు సానుభూతి ఉందో అర్థమవుతుంది ఆదివారం గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతాలకు చెందిన సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు పులిమోహన్, సీనియర్ జర్నలిస్టు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యులు (గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ) బొంకూరి మధు , రాష్ట్ర ఉపాధ్యక్షులు మహిషా రాజేష్ , రాష్ట్ర కార్యదర్శి మంతెన లింగయ్య , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇరుగురాల కిష్టయ్య , నాయకులు పెరిక రవి , ఉప్పులేటి పవన్ కుమార్ , ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేంద్ర కుమార్ , సభ్యులు ఆర్నకొండ వెంకటేశ్వర్లు , ఏఐటీయూసీ నాయకులు కందుకూరి రాజా రత్నం , ఏం ఏ కరీం, జనరల్ సెక్రెటరీ శనగరపు చంద్రశేఖర్, మాదిగ మిత్రమండలి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటగిరి పాపయ్య , పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బుష్పాక సంతోష్ , ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అజయ్ ని పరామర్శించడం జరిగింది. భవిష్యత్తులో సింగరేణి సంస్థలో ఉన్నత స్థాయిలో ఉద్యోగం చేయవలసిన అజయ్ దళిత సంఘాల వారిని చూడగానే కన్నీటి పర్యంతంగా ఏడ్చారు తనను కుల పేరుతో తిట్టి కొట్టి అవమానించిన శ్రీనివాసరావు గురించి కన్నీటితో వివరించారు. అకారణంగా దళిత కులానికి చెందిన అజయ్ ని కొట్టడమే కాక, దళిత కులాన్ని వాళ్ళ అమ్మను అనరాని,బూతులు తిడుతూ, బెదిరింపులకు గురిచేసిన శ్రీనివాసరావు తక్షణమే సింగరేణి యాజమాన్యం డిస్మిస్ చేయాలని, దళిత సంఘాలు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశాయి, అంతేకాకుండా అజయ్ నీ, వారి తల్లిని దళిత కులాన్ని కూడా నోటికి వచ్చినట్టు తిట్టిన శ్రీనివాసరావును తక్షణమే అరెస్టు చేయాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు.పూర్తి వివరాలను నివేదిక రూపంలో తయారుచేసి, రామగుండం పోలీస్ కమిషనర్ ని, ఏసిపి ని, గోదావరిఖని వన్టౌన్ సిఐ ని కలిసి శ్రీనివాసరావు పై అన్ని సంఘాల పక్షాన ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నాం ఆని తెలిపారు

## వికారాబాద్ జిల్లా..జిల్లా లో నాలుగు నియోజకవర్గాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయ ము చేసుకుంటూ రేషన్ కార్డు వెరిఫికేషన్ పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు.



వికారాబాద్ జిల్లా ప్రతినిధి: (జనం రిపోర్టర్ ): వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం క్యాంపు కార్యాలయం నుండి టే లి కాన్ఫరెన్స్ నిర్వహించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు...అర్హత కలిగిన అందరికి రేషన్ కార్డు ఇవ్వబడుతుంది.21 నుండి నిర్వహించే గ్రామ సభల్లోనూ దరఖాస్తు తీసుకుంటాం, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డు అందజేస్తామని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.రేషన్ కార్డు జారీకి సంబంధించి అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు కార్డులు అందజేస్తామని అన్నారు. గ్రామ సభల్లో, వార్డుల్లో, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించిన వాటిని పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ప్రజాపాలన ఫారములతో పాటు ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. కుటుంబంలో విభజన అయినవారు కొత్త కార్డు కావాలని తీసుకున్న దరఖాస్తును కూడా పరిశీలిస్తామన్నారు. గతంలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని అన్నారు. ఇదివరకు ఎప్పుడూ దరఖాస్తు సమర్పించకపోయినా గ్రామాలు, వార్డుల్లోకి వచ్చే అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుని ప్రజా పాలన ఆన్లైన్ లో రాని వారు కూడా గ్రామ సభల్లో, ప్రజా పాలన సేవ కేంద్రాల్లో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

## జిల్లా ఇజితమాకు భారీగా హాజరైన ముస్లిం సోదరులు



నార్పల(జనం రిపోర్టర్ ):నార్పల మండల కేంద్రంలోని క్రాసింగ్ వద్ద జరుగుతున్న జిల్లా ఇజితిమాకు ముస్లిం సోదరులు భారీ ఎత్తున తరలివచ్చారు. మత గురువులు బోధించే ఆధ్యాత్మిక బోధనలను వినడానికి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి ముస్లిం సోదరులు వేలాదిమంది తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లింలకు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ నందు వస్తువులను కొనడానికి ముస్లిం సోదరులు పోటీపడ్డారు. మత గురువుల ఆధ్యాత్మిక బోధనలను వినడానికి వచ్చిన ముస్లిం సోదరులందరికీ ముస్లింలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన డీఎస్పీ వెంకటేశ్వరరావు ఇజితిమా కార్యక్రమమునకు వేలాదిమందిగా హాజరైనందున ఈ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డి.ఎస్.పి వెంకటేశ్వరరావు, శింగనమల సీఐ కౌలుట్లయ్య, నార్పల ఎస్సై సాగర్ డ్రోన్ కెమెరాలతో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఉత్సవాలకు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గారిని ఆహ్వానించిన పెబ్బేరు రైతు సంఘం నాయకులు




పెబ్బేరు (జనం రిపోర్టర్ ):పట్టణ కేంద్రంలో అత్యంత ప్రత్యేకత కలిగిన శ్రీ శ్రీ శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఉత్సవాలలో భాగంగా అంతర్రాష్ట్ర అఖిలభారత ఒంగోలు జాతి పశుబల ప్రదర్శన బండలాగుడు పోటీలకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి గారిని పెబ్బేరు రైతు సంఘం నాయకులు ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి గారు మాట్లాడుతూ తమ వంతు సహకారం అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి తమ వంతు కృషి చేస్తానని తెలపడం జరిగింది, బండలాగుడ పోటీలకు పాల పండ్ల కేటగిరి విభాగానికి 110000 లక్ష పదివేల రూపాయలు బహుమతిని ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు ధన్యవాదాలు తెలుపడం జరిగింది ఈ కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, రైతు సంఘం నాయకులు పబ్బ శేఖర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, రాంపురం సహదేవుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు మన్యం అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వల్లపు రెడ్డి రణధీర్ రెడ్డి కృపాకర్ రెడ్డి బున్యదిపురం నరేందర్, మహేశ్వర్ రెడ్డి పాతపల్లి చంద్రశేఖర్, సాయి రెడ్డి, రాజనాయక్ ఎల్లస్వామి బొట్టు శ్రీను, జగదీశ్వర్ రెడ్డి వెంకటేష్ దాసరాజుల బాస్కర్, వెంకటేష్ గట్టు రాజు రైతు సంఘం మనోహర్ రెడ్డి నాయకులు చంద్రయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎద్దుల రాములు గారి దశదిన కర్మకు హాజరై, నివాళులర్పించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గారు

### రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు



పెబ్బేరు(జనం రిపోర్టర్ ): పట్టణ కేంద్రానికి చెందిన ఎద్దుల రాములు గారు పెబ్బేరు మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీమతి ఎద్దుల కర్ణ శ్రీ సాయినాథ్ గారి మామగారు మరణించిన విషయం తెలిసిందే ఈ రోజు వారి దశదినకర్మకు హాజరై వారి చిత్రపటం వద్ద నివాళులర్పించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గారు మరియు టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి,రాంపురం సహదేవుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు మన్యం అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వల్లపు రెడ్డి రణధీర్ రెడ్డి కృపాకర్ రెడ్డి బున్యదిపురం నరేందర్, మహేశ్వర్ రెడ్డి, శివ ప్రసాద్ గౌడ్ ,పాతపల్లి చంద్రశేఖర్, సాయి రెడ్డి,దాసరాజుల బాస్కర్, రాజనాయక్ ఎల్లస్వామి బొట్టు శ్రీను, జగదీశ్వర్ రెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలి ప్రముఖ వ్యాపారవేత్త మహంకాళి శ్రీనివాసులు



(వనపర్తి జిల్లా ప్రతినిధి) అమరచింత (జనం రిపోర్టర్ ):పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేయాలని అమరచింత వాసి ప్రముఖ వ్యాపారవేత్త సామాజిక సేవకులు మహంకాళి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన అమర్ చింత పట్టణంలోని తన స్వగృహంలో జనం రిపోర్టర్ 2025 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనం రిపోర్టర్ పత్రిక అనతి కాలంలోనే ప్రజాదరణ చూరగొనిందని అన్నారు. ప్రజల సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారం కోసం పత్రిక పని చేయడం అభినందనీయమన్నారు. సమస్యల పరిష్కారంలో పత్రిక కృషి వెల కట్టలేనిదని ఆయన అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, పాలకుల ద్వంద విధానాలను ప్రశ్నిస్తూ ప్రజలకు వారధిగా నిలబడిందని ఆయన జనం రిపోర్టర్ పత్రికను ప్రశంసించారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలి ఏసిపి తిలక్





ఎన్టీఆర్ జిల్లా,కంచికచర్ల (జనం రిపోర్టర్ ):రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఏసిపి తిలక్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా కంచికచర్ల మండలం పరిధిలో కీసర స్వర్ణ టోల్ ప్లాజా వద్ద ఆదివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకుని వాహనాలు నడపాలన్నారు. జాగ్రత్తలు పాటించడం వల్ల సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు అన్నారు. రోడ్డు భద్రత లు పాటించకుండా వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదానికి గురవుతే మనల్ని నమ్ముకొని ఉన్న కుటుంబం రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని అన్నారు. హెల్మెట్ పెట్టుకుని వాహనం నడిపే వాహనదారులను అభినందించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎస్సై బి రాజు సిబ్బంది పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ ప్యాకేజీ వెనుక మతలబు ఏంటి: అమర్నాథ్



విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్ జగన్ వ్యతిరేకమే అని చెప్పుకొచ్చారు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్. వైఎస్సార్‌సీపీ వల్లే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగింది. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అండగా వైఎ?స్సార్‌సీపీ నిలబడిందని అమర్నథ్ తెలిపారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విశాఖలో మీడియాతో మాట్లాడుతూ..'వెంటిలేటర్ మీద ఉన్న స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ కేవలం ఆక్సిజన్‌లా పని చేస్తుంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు మొదటి నుంచి వైఎస్ జగన్ వ్యతిరేకం. వైఎస్సార్‌సీపీ వలనే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగింది. ఈ మాట స్వయంగా కేంద్ర మంత్రి కుమార్ స్వామి చెప్పారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించింది అని మంత్రి చెప్పారు. కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ నిలబడింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాము. రూ.11,400కోట్ల ప్యాకేజీలో గతంలో ఇచ్చిన 1500 కోట్లు మినహాయించి మిగిలిన రూ.9800కోట్లు ఇస్తున్నారని మాకు సమాచారం ఉంది. ప్రధాని మోదీ సభలో ఎందుకు ప్యాకేజీ ప్రకటించలేదు. మీ ప్యాకేజీ వెనుక మతలబు ఏంటి?. స్టీల్ ప్లాంట్ అప్పులు కట్టలేని పరిస్థితిలో ఉంది. స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని ఉద్దేశ్యం ఉంటే ప్రైవేటీకరణ జరగదని ఎందుకు చెప్పలేదు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఎందుకు వెనక్కి తీసుకోలేదు. కేంద్రం ఇచ్చే ప్యాకేజీ అప్పులకే సరిపోతుంది. ప్లాంట్‌లో వీఆర్ఎస్‌ను ఎందుకు తీసుకువచ్చారు. 25వేల మందితో నడవాల్సిన ప్లాంట్ 10 వేల మందితో నడుస్తుంది. ఇంకా ఉద్యోగులను తొలగిస్తే ప్లాంట్ ఎలా నడుస్తుంది. స్టీల్ ప్లాంట్ ఎంతో సెంటిమెంట్‌తో ఏర్పడింది. 55వేల కోట్లు పన్నుల రూపంలో కట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ముందు నాలుగు డిమాండ్స్ పెడుతున్నాం. స్టీల్ ప్లాంట్‌కు ట్యాక్స్ హాలీడే ఇవ్వాలి. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చెయ్యాలి. సొంతంగా గనులు కేటాయించాలి. 200ఏళ్లకు సరిపడే గనులు కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. రాష్ట్రపతి పేరు మీద ఉన్న స్టీల్ ప్లాంట్ భూములు స్టీల్ ప్లాంట్ పేరు మీద మార్చాలి. కూటమి పాలన వచ్చిన తర్వాత కార్మికులకు జీతాలు ఇవ్వలేదు. ఉద్యోగులను తొలగించారు. అలెవెన్స్ కూడా ఇవ్వలేదు. పీఎఫ్ డబ్బులు వాడేశారు. ఇన్నీ చేసి.. ఎందుకు కూటమి నేతలు సంబురాలు చేసుకున్నారో అర్థం కాలేదు. గతంలో కూడా అనేక ప్రభుత్వాలు స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీలు అందించాయి' అంటూ కామెంట్స్ చేశారు.

### నాపై సోషల్ మీడియాలో వేధింపులు..

## బాబుకు బాధ్యత లేదా



హైదరాబాద్: సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న వేధింపులపై స్పందించాల్సిన బాధ్యత మీకు లేదా చంద్రబాబు అని ప్రశ్నించారు నందమూరి లక్ష్మీపార్వతి. మీరు అనుకున్నా.. అనుకోకున్నా మీ అత్తగారిని కదా చంద్రబాబు అని వ్యాఖ్యానించారు. అలాగే, ఎన్టీఆర్ గౌరవం కాపాడేలా తాను బ్రతుకుతున్నట్టు తెలిపారు. నేడు దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు వర్ధంతి. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పించారు నందమూరి లక్ష్మీపార్వతి. ఇదే సమయంలో ఎన్టీఆర్ ఘాట్ సాక్షిగా లక్ష్మీపార్వతి కీలక వ్యాఖ్యలు చేశారు. అక్కడ లక్ష్మీపార్వతి మాట్లాడుతూ..'29 ఏళ్లుగా ఎన్టీఆర్‌కు దూరమై మనోవేదనకు గురవుతున్నాను. నా ఫోన్ నెంబర్‌ను ఎవరో టీడీపీ వాళ్లు సోషల్ మీడియాలో పెట్టారు. నిన్నటి నుంచి వరుసగా వెయ్యికిపైగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. మీరు అనుకున్నా.. అనుకోకున్నా మీ అత్తగారిని కదా చంద్రబాబు. ఇలాంటి అవమానం నాకు జరుగుతుంటే మీరు చూస్తూ ఉంటారా?. ఇన్నేళ్లు డబ్బులు ఉన్నా లేకున్నా ఎవరినీ చేయిచాచి అడగలేదు. ఎన్టీఆర్ గౌరవం కాపాడేలా బ్రతుకుతున్నాను. నామీద ఎందుకు మీకు కక్ష.. నేనేం తప్పు చేశాను. ఎన్టీఆర్ పేరుతో మీరంతా లక్షల కోట్లు సంపాదించారు. అలాగే పెద్దాయన్న సాగనంపారు. నాపై జరుగుతున్న వేధింపులపై స్పందించాల్సిన బాధ్యత మీకు లేదా చంద్రబాబు' అని ప్రశ్నించారు.

## మంత్రి కొండా సురేఖ పర్యటనలో ప్రోటోకాల్ వివాదం



మెదక్ జిల్లా: మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారంలో మంత్రి కొండా సురేఖ పర్యటనలో ప్రోటోకాల్ వివాదం నెలకొంది. చెక్కుల పంపిణీ వేదికపైకి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి రావడంతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో వివాదం నెలకొంది. ఇరు పార్టీల మధ్య తోపులాట జరిగింది. పెద్ద ఎత్తున నినాదాలు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ కార్యక్రమంలో చిల్లర రాజకీయాలు చేయడానికి సిగ్గు ఉండాలి అంటూ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలి

మరోవైపు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవాలు నిర్వహించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తన తీరు మార్చుకోవాలని నార్సింగి కాంగ్రెస్ మండల నాయకులు హెచ్చరించారు. శుక్రవారం నార్సింగి మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, యాదగిరియాదవ్, ఎస్సీ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన సీసీరోడ్ల పనులు ప్రారంభించడానికి వచ్చే ఎమ్మెల్యే ఎవరికి సమాచారం ఇవ్వకుండా రావడంపై మండిపడ్డారు.

మెదక్ జిల్లా వడియారంలో మంత్రి పర్యటనలో ప్రోటోకాల్ వివాదం

గత ఏడాది ప్రారంభించిన నర్సంపల్లి జీపీ భవనం తిరిగి ప్రారంభించడం ఎందుకని ప్రశ్నించారు. శిలాపలకపై ఇన్‌చార్జి మంత్రి పేరు పెట్టకపోవడం ఎంటని ప్రశ్నించారు. ప్రభుత్వం నియమించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులకు కూడా సమాచారం ఇవ్వరా అని వాపోయారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాజీ ప్రతినిధులను వెంట బెట్టుకోని ప్రారంకోత్సవాల చేస్తే చూస్తూ ఉరుకునేదిలేదని తెలిపారు.

## బాబు, పవన్.. తిరుమలలో ఏం జరుగుతోంది: భూమన



తిరుపతి: తిరుమల విషయంలో గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన కూటమి సర్కార్ అధికారంలో ఉండగా జరుగుతున్న దేమిటి? అంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రశ్నించారు. తిరుమలలో విజిలెన్స్ నిఘా పూర్తిగా వైఫల్యం చెందిందన్న భూమన.. చంద్రబాబు పాలనలో మద్యం, మాంసం తిరుమలలో పట్టుబడు తున్నాయని దుయ్యబట్టారు. "శ్రీవారి ఆలయానికి సమీపంలో గుడ్డు బిర్యాని పట్టుబడిందంటే.. టీటీడీ వైఫల్యం మరోసారి బట్టబయలైంది. మారణాయుధాలలతో వచ్చిన పట్టించుకోలేని పరిస్థితికి తీసుకొచ్చారని మండిపడ్డారు. ఎల్లో మీడియా ద్వారా అబద్ధపు ప్రచారాలు చేశారు. టీడీపీ నాయకులు సేవలో టీటీడీ చైర్మన్ పని చేస్తున్నారు, భక్తులను పట్టించుకోవడం లేదు...తిరుమల కొండపై ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తూ 4సార్లు పట్టు బడ్డారు. 40 సార్లు పట్టుబడకుండా తప్పించుకు తిరిగి ఉంటారు. లడ్డూ ప్రసాదం విషయంలో మాపై నింద మోపారు. మాపై నేరారోపణలు చేశారు. సనాతన హిందూ ధర్మం కోసం పీఠాధిపతులు, హిందుత్వ సంఘాలు.. పవన్ కల్యాణ్, చంద్రబాబును ప్రశ్నించాలని కోరుతున్నామని భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు.

# ఉద్యోగులకు తీపి కబురు



ఏడాదిగా కేంద్ర ప్రభుత్వోద్యోగులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఎనిమిదో వేతన సంఘం సాకారం కాబోతోంది. ఆ సంఘం రూపురేఖలూ, దాని గడువు, మార్గదర్శకాలు వగైరా వివరాలు ఇంకా తెలియాల్సేవున్నా తమ జీతభత్యాలు పెరగబోతున్నాయన్న కబురు సహజంగానే ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. కేంద్ర వేతన సంఘం సిఫార్సులకు కొంచెం అటూ ఇటూగా రాష్ట్రాల్లో వేతన సవరణ సంఘాలు కూడా సిఫార్సులు చేస్తాయి గనుక రాష్ట్రప్రభుత్వాల సిబ్బందికి సైతం ఇది సంతోషించే సందర్భమే. పదేళ్లకోసారి నియమించే వేతన సంఘాల గురించిన ప్రకటన లెప్పుడూ లోక్‌సభ ఎన్నికల ముందు వెలువడటం రివాజు. అందుకే నిరుడంతా ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఎట్టకేలకు ఇన్నాళ్లకు ప్రకటన వెలువడింది. మరో మూడు వారాల్లోఅసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న ఢిల్లీలో గణనీయంగావున్న కేంద్ర సిబ్బంది ఓటుబ్యాంకునుదృష్టిలో ఉంచుకునే తాజా ప్రకటన వెలువడిందన్న విమర్శలు లేకపోలేదు. మన దేశంలో ప్రభుత్వో ద్యోగులు సంఘటిత శక్తి, పటిష్ఠమైన ఓటుబ్యాంకు కూడా! కనుక వారిని నిరాశపరచాలని ఏ ప్రభు త్వమూ చూడదు. ఇందుకు ఒకే మినహాయింపు వుంది. 2003లో కేంద్రంలో వాజపేయి నేతృత్వంలోని అప్పటి ఎన్డీయే సర్కారు వేతన సంఘం డిమాండ్‌ను తిరస్కరించింది. అటు తర్వాత వచ్చిన యూపీఏ ప్రభుత్వం 2005లో వేతన సంఘం ఏర్పాటు చేసి, ఆ మరుసటి ఏడాది జనవరి 1 నుంచి దాని సిఫార్సులు అమలుచేయటం మొదలుపెట్టింది. అంతేకాదు... 2013లో ఏడో వేతన సంఘం ఏర్పాటును ప్రకటించింది. దేశంలో రక్షణ, రైల్వే విభాగాల సిబ్బందిని కూడా కలుపుకొంటే 49 లక్షల మందికి పైగా కేంద్రప్రభుత్వోద్యోగులున్నారు. వీరుగాక పింఛన్ అందుకునే 65 లక్షల మంది రిటైర్డ్ సిబ్బంది ఉన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఉద్యోగుల జీతభత్యాలనూ, ప్రభుత్వరంగ సిబ్బందికి ఇచ్చే బోనస్‌నూ వేతన సంఘం సిఫార్సు చేస్తుంది. అలాగే పింఛన్‌దార్లకు నెలనెలా చెల్లించాల్సిన మొత్తం, కరువుభత్యం కూడా నిర్ణయిస్తుంది. అది చేసే సిఫార్సులను యథాతథంగా ఆమోదించటం లేదా ఉద్యోగుల కోర్కె మేరకు దాన్ని మరింత పెంచటం, తనకున్న వనరులను దృష్టిలో ఉంచుకుని ఆ సిఫార్సులకు కోతపెట్టడం కేంద్రం చేసే పని. కేంద్రంలోనైనా, రాష్ట్రాల్లోనైనా రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య రానురాను తగ్గిపోతోంది.కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవటం, తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని నియమించుకోవటంగతంతో పోలిస్తే పెరిగింది. ఏతావాతా, రిటైరవుతున్న సిబ్బంది స్థానంలో కొత్త రిక్రూట్‌మెంట్లు బాగా తగ్గాయి. ఆరో వేతన సంఘం ఏర్పాటు సమయానికి దేశంలో 55 లక్షలమంది కేంద్రసిబ్బంది ఉన్నారని అంచనా వేశారు. ఇప్పుడు నిండా 50 లక్షల మంది కూడా లేరు. మరో మాటలో %-% సర్వీసులో ఉన్న సిబ్బంది కన్నా పింఛన్‌దార్లే ఎక్కువున్నారు. దాదాపు అన్ని ప్రభుత్వ విభాగాల్లో సంపూర్ణంగా కంప్యూటరీకరణ జరగటంతోపాటు ఇంటర్నెట్ అందుబాటులోకొచ్చింది కనుక ముని పటితో పోలిస్తే ఎక్కువమంది సిబ్బంది అవసరం ఉండకపోవచ్చన్న వాదనలో నిజముంది. కానీ మనతో పోలిస్తే అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిన అమెరికాలో ప్రతి లక్షమంది పౌరులకూ దాదాపు ఏడువేల మంది ప్రభుత్వ సిబ్బంది ఉన్నారు. మన దేశంలో అది 1,500 మించదు. అమెరికాలో తమ ఏలుబడి మొదలయ్యాక ప్రభుత్వ సిబ్బంది సంఖ్యలో భారీగా కోత పెడతామని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో డోనాల్డ్ ట్రంప్ బాహాటంగానే చెప్పారు. ఫలితాలొచ్చిన వారం రోజు ల్లోపునే ప్రభుత్వ సామర్థ్య విభాగం పేరిట వివేక్ రామస్వామి, ఎలాన్ మస్క్‌లతో ఆయన ఒక కమిటీని కూడా నియమించారు. తాము విడివిడిగా ఉరిశిక్షలు వేయబోమని, ఒకేసారి ఊచకోతఉంటుందని వివేక్ రామస్వామి చమత్కరించారు కూడా! కనుక అక్కడ కూడా ప్రభుత్వ సిబ్బంది తగ్గుతారు. చాలా యూరప్ దేశాల్లో రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్లలో కోతపెట్టే ప్రయత్నాలు చేయటం, దాన్ని ఉద్యోగులు ప్రతిఘటించటం కనబడుతూనే ఉంది. ప్రభుత్వ పథకాలను ప్రజానీకానికి చేర్చటంలో ప్రభుత్వ సిబ్బంది పాత్ర కీలకమైనది. గతంతో పోలిస్తే కొత్త సాంకేతికతలు అందుబాటులోకొచ్చి ఉండొచ్చుగానీ అందుకు తగ్గట్టే సూక్ష్మస్థాయివివరాల సేకరణ పెరిగింది గనుకా, రిటైరవుతున్నవారి స్థానంలో కొత్త నియామకాలు లేవు గనుకా వారి పని భారం పెరిగింది. పని మీద శ్రద్ధలేనివారూ, అవినీతికి పాల్పడేవారూ అన్నిచోట్లాఉంటారు. వారి వల్ల సహజంగానే అందరికీ చెడ్డపేరు వస్తుంది. ప్రభుత్వోద్యోగులపైనా అలాంటి నింద ఉంది. ఉద్యోగ భద్రత వరకూ చూస్తే ప్రైవేటు రంగంలో కన్నా ప్రభుత్వరంగంలో అది ఎక్కువ. ఒకసారంటూ ప్రభుత్వ ఉద్యోగం వస్తే చీకూచింతా ఉండబోదని అనుకుంటారు గనుకేఅందుకోసం చాలామంది అర్రులు చాస్తారు. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంలో విఫలమవుతున్నందున వేతనాలు పెంచాలన్న ప్రభుత్వ సిబ్బంది డిమాండ్‌కు ప్రభుత్వాలు తలొగ్గక తప్పడం లేదు. కొన్ని లోటుపాట్లున్నా ప్రభుత్వోద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వాలు శ్రద్ధ పెడుతున్నాయి. నిర్ణీత కాలంలో జీతభత్యాలు పెంచుతున్నాయి. కానీ వారితో పోలిస్తే ఎంతో ఎక్కువున్న ప్రైవేటురంగ సిబ్బందినీ, రెక్కాడితే గానీ డొక్కాడని అసంఘటిత రంగ కార్మికులనూ, వారి సంక్షేమాన్నీ విస్మరిస్తున్నాయి. పాశ్చాత్యదేశాల్లో ఇంత చేటు అసమానతలుండవు. ప్రభుత్వ సిబ్బందిలో జవాబుదారీతనాన్నిఆశించే పాలకులు ఈ రంగాల పట్ల తాము ఎలా వ్యవహరిస్తున్నామో ఆలోచించుకోవాలి. ఈ అసమానతల్ని తగ్గించే ప్రయత్నం చేయాలి.

## పనిగంటలు దేశగతిని మారుస్తాయా?



ఒకరేమో వారానికి 70 గంటలు పనిచేయమంటారు. మరొకరు ఇంకో అడుగు ముందుకేసి 90 గంటలు పనిచేయమంటారు. దేశం అభివృద్ధి పథంలో పయనించేందుకు ఉన్న ఒకే ఒక్క మంత్రం ఇదేనంటారు. కానీ, వారానికి 48 గంటలు పనిచేస్తూనే ప్రపంచం నివ్వెరపోయే ప్రగతి సాధించామన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. అంతేకాదు, రోజంతా ఆఫీసుల్లోనే ఉండి రోబోల్లా పనిచేస్తూ పోతే దేశం అభివృద్ధి సంగతి దేవుడెరుగు, తలెత్తే మానసిక, ఆరోగ్య సమస్యల సంగతేంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతుందన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేస్తే దేశం గొప్ప పురోగతి సాధిస్తుందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి గతంలో ప్రకటించి దేశవ్యాప్త చర్చకు కారణమయ్యారు. తాజాగా, ఎల్అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్ ఒకడుగు ముందుకు వేసి వారానికి 90 గంటలు పనిచేయాలని సెలవిచ్చి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేశారు. నిజానికి ఫ్యాక్టరీల చట్టం 1948 ప్రకారం వారానికి 48 గంటలు మించి పనిచేయకూడదు. ఈ చట్టాలను అనుసరిస్తూనే 75 ఏండ్లలో దేశం అనూహ్య ప్రగతి సాధించింది. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు కార్పొరేట్ దిగ్గజాలు భారత శ్రామికులను వారానికి 70 నుంచి 90 గంటలు పనిచేయాలని సూచించడం ఎంతమాత్రం హేతుబద్ధంగా, ఆచరణాత్మకంగా కనిపించడం లేదు. సుబ్రహ్మణ్యన్ చెప్తున్న దాని ప్రకారం వారానికి 90 గంటలు పనిచేయడమంటే రోజుకు 12 గంటలకు పైగా శ్రమపడాల్సి ఉంటుంది. నారాయణమూర్తి 70 గంటల ప్రతిపాదనను ఎంతోమంది విమర్శించారు. ఇప్పుడు సుబ్రహ్మణ్యన్ అంతకుమించి విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. సోషల్ మీడియా ఆయనపై జోక్స్, మీమ్స్‌తో విరుచుకుపడింది. గతంలో ఎలాన్ మస్క్, జాక్ మా కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసి విమర్శల పాలయ్యారు. 48 గంటల పని విధానం దేశంలో కొనసాగుతున్నప్పటికీ నగర, పట్టణ ప్రాంతాల్లోని కంపెనీ ఉద్యోగులు తగిన వేతనం పొందకుండానే పరిమితికి మించి పనిచేస్తున్న మాట వాస్తవం. ఉద్యోగులు కష్టపడి పనిచేస్తూ దేశాన్ని ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి తీసుకెళ్లారు. సాధారణ పనిదినాల అమలు చట్టాలు వర్తించని రీతిలో 88 శాతం మంది భారత ఉద్యోగులను కంపెనీలు నియమించుకుంటున్నాయని ఇండీడ్ అనే గ్లోబల్ సంస్థ సర్వేలో తేలింది. ప్రభుత్వ సెలవు దినాలు, సిక్ లీవ్‌లో ఉన్నప్పుడు కూడా కంపెనీ యాజమాన్యాలు తమతో పనిచేయించుకుంటున్నాయని 85 శాతం మంది ఉద్యోగులు చెప్పినట్టు సర్వే పేర్కొన్నది. విధులు ముగిశాక యాజమాన్యాలు పంపే సందేశాలకు స్పందించకుంటే ప్రమోషన్లు వంటి ప్రయోజనాలను ఎక్కడ కోల్పోతామోనన్న భయం ఉద్యోగులను వెంటాడుతూ ఉంటుంది. కొన్ని రంగాల్లో ఉద్యోగులు ఇప్పటికే పనికి సంబంధించి కంపెనీ ఆదేశాలు పాటించేందుకు రోజంతా అందుబాటులో ఉంటున్నారు. కొందరు అదనపు జీతభత్యాలు పొందకుండానే నిర్దేశిత పని గంటలకు మించి శ్రమపడుతున్నారు. కానీ, పదిహేను అగ్రశ్రేణి గ్లోబల్ టెక్ కంపెనీల ఉద్యోగులు వారానికి 50 గంటల లోపే పనిచేస్తుండటం గమనార్హం. 'ఓవర్‌టైమ్' కారణంగా అత్యధిక మరణాలు సంభవించే దేశాల్లో ఇండియా ముందు వరుసలో ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్త సర్వేలో వెల్లడైంది. సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో ఎల్అండ్‌టీ స్పందించింది. అసాధారణ ఫలితాలు సాధించేందుకు అసాధారణ ప్రయత్నాలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడానికి మాత్రమే సుబ్రహ్మణ్యన్ ఆ వ్యాఖ్యలు చేశారని చెప్పుకొచ్చింది. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియాను ముందుకు తీసుకెళ్లడానికి మరింత అంకితభావంతో పనిచేయాలనేదే ఎల్ అండ్ టీ లక్ష్యమని, కంపెనీ ఉద్దేశాన్ని, విస్తృత లక్ష్యాలను చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇక నారాయణమూర్తి వారానికి 70 గంటల పని విధానం ప్రతిపాదనపై ప్రముఖ ఐటీ కంపెనీ జోహో కార్పొరేషన్ సీఈవో శ్రీధర్ వెంబూ తీవ్రంగానే స్పందించారు. 'జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, చైనాలు మితిమీరిన శ్రమతో అభివృద్ధి సాధించాయి. ఇవి తమ ప్రజలను శిక్షించే స్థాయిలో పనిభారం మోపాయి. ఆఫీసుల్లో, ఫ్యాక్టరీల్లో రెక్కలుముక్కలు చేసుకుని జనం పనిచేసిన కారణంగా ఈ దేశాల్లో జనాభా బాగా తగ్గిపోతున్నది. ఫలితంగా అక్కడి ప్రభుత్వాలే ప్రజలను ఇంకా ఎక్కువ పిల్లలను కనండి అని వేడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది' అని విరుచుకుపడ్డారు. ఎక్కువ గంటలు కష్టపడి పనిచేస్తూ అభివృద్ధి సాధించిన దేశాల్లోని ప్రజలు వృద్ధాప్యంలో ఒంటరిగా బతకాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. కంపెనీల రథసారథులు కొద్దిమంది ఎక్కువ గంటలు పనిచేస్తే చాలని, ఉద్యోగులంతా ఒళ్లు హూనం చేసుకుని శ్రమిస్తే వ్యతిరేక ఫలితాలు తప్పవని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక ప్రగతిలో ఇండియాకు చైనా ఎన్నటికీ ఆదర్శం కాకూడదని వెంబూ చేసిన హెచ్చరిక హేతుబద్ధంగా కనిపిస్తున్నది. మూర్తి, సుబ్రహ్మణ్యన్ చెప్పినట్టు రోజుకు అందరూ సగటున పది గంటలు పనిచేస్తే ఆయుష్షు కూడా తగ్గిపోయే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. అధిక పనిగంటల వల్ల మానసిక, శారీరక ఒత్తిడి పెరుగుతుంది. అప్పుడు సామాజిక జీవితం అంటూ ఏమీ మిగలదన్నది అత్యధికుల మాట. భారత శీఘ్ర ఆర్థిక ప్రగతికి ఈ ఇద్దరు దక్షిణాది కార్పొరేట్ దిగ్గజాలు ఒకే తీరున సూచించిన పరిష్కార మార్గాలను పరిశీలిస్తే ఇండియాలో 1970, 80లలో ప్రచారంలో ఉన్న ఒక వింత పుక్కిటి పురాణం పాత తరం వారికి గుర్తుకొస్తున్నది. అప్పట్లో జపాన్ అనేక రంగాల్లో అమెరికా, ఐరోపా దేశాలను తలదన్నే రీతిలో ఆర్థికాభివృద్ధి సాధించడం మొదలైంది. దానికి కారణం జపాన్‌లో కార్మికులకు కంపెనీల యాజమాన్యాలపై అసంతృప్తి, ఆగ్రహం వస్తే పని బంద్ చేసి సమ్మెలకు దిగకుండా ఫ్యాక్టరీల్లో ఎక్కువ గంటలు పని చేసేవారనే ప్రచారం దేశవ్యాప్తంగా నడిచింది.

# ఢిల్లీ మరోసారి ఆప్‌కు దక్కేనా!



నాలుగోసారి ఢిల్లీ ఎన్నికల బరిలో దిగుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరోమారు సీఎం కుర్చీపై కన్నేశారు. పదకొండేండ్ల క్రితం 2013లో తొలిసారి పోటీ చేసి మెజారిటీ రాకున్నా ఆయన సీఎం అయ్యారు. అయితే, 48 రోజులు మాత్రమే అధికారంలో ఉన్నారు. ఆ తర్వాత వరుసగా 2015, 2020 ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించారు. అయితే, ఈసారి మాత్రం బీజేపీ రూపంలో ఆయనకు పెనుసవాలు ఎదురుకాబోతున్నది. ఫిబ్రవరి 5న జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ అన్ని అస్త్రాలను సిద్ధం చేసుకొని పెట్టుకున్నది. 1998 డిసెంబర్‌లో ఓడిన తర్వాత బీజేపీ ఇప్పటివరకు అక్కడ అధికారంలోకి రాలేకపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధిస్తున్నా ఢిల్లీ సీఎం పీఠం మాత్రం ఆ పార్టీకి అందని ద్రాక్షగా మారింది. ఈ నేపథ్యంలో ఈసారి గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నది. 'ఆప్' ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తున్నది. ఇక, 1998-2013 మధ్య 15 ఏండ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఒక్క సీటూ గెలువలేక పోయింది. మరోవైపు, అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధిస్తున్న 'ఆప్'కు పార్లమెంటు ఎన్నికలు మాత్రం కొరుకుడుపడటం లేదు. ఏడు స్థానాల్లో ఒక్కటంటే ఒక్క దాంట్లోనూ విజయం సాధించలేక చతికిలపడుతున్నది. గత ఎన్నికల్లో విజయం సాధించిన కేజ్రీవాల్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతూ వస్తున్నది. కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న ఢిల్లీలో అంతంత మాత్రంగానే ఉండే అధికారాలను కూడా అడ్డుకుంటున్నది. తనకు అనుకూలమైన లెఫ్టినెంట్ గవర్నర్లను నియమించుకొని అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నది. 'ఆప్'లో నంబర్ టూగా పరిగణించే ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను అవినీతి కేసులో నెలలపాటు నిర్బంధించింది. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను కూడా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు అరెస్ట్ అయిన ఆయన 5 నెలలపాటు జైలులో గడిపారు. బెయిలుపై బయటకు వచ్చాక సెప్టెంబర్ 17న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి క్యాబినెట్‌లో కీలక సభ్యురాలు ఆతిశీ మార్లెనాకు ప్రభుత్వ పగ్గాలు అప్పగించారు. కేజ్రీవాల్‌కు అత్యంత నమ్మకస్థురాలు, విధేయురాలైన మంత్రిగా పనిచేసిన ఆమె నేతృత్వంలోని 'ఆప్' సర్కారు పాత సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త వాటిని ప్రకటించింది. వాటిలో ముఖ్యమైనది 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన'. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు ప్రతినెల రూ. 1000 చొప్పున అందిస్తారు. కాంగ్రెస్, బీజేపీ కూడా ఇలాంటి నగదు బదిలీ పథకాలనే పోటాపోటీగా ప్రకటించాయి. ప్రజా సంక్షేమ పథకాలతోపాటు విద్య, వైద్య రంగాల్లో పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు చేసిన మేలు కారణంగా ఈ ఎన్నికల్లో సైతం విజయంపై 'ఆప్' ధీమాగా ఉన్నది. అయితే, రాజకీయ పండితులు మాత్రం ఈ అసెంబ్లీ ఎన్నికలు పాలకపక్షమైన 'ఆప్'కు అత్యంత కఠిన పరీక్షగా మారనున్నాయని అంచనా వేస్తున్నారు. 'ఆప్' అగ్రనేతల్లో చాలామంది నిన్నమొన్నటి వరకు వివిధ అవినీతి కేసుల్లో నిర్బంధంలో ఉన్నారు. అయినా, కేజ్రీవాల్ దూకుడు, పోరాట పటిమతో ఎన్నికల ప్రచారంలో జాతీయపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ కన్నా చాలా ముందున్నట్టు కనిపిస్తున్నది. ఇప్పటికే అన్ని సీట్లకూ ఆప్ తమ అభ్యర్థులను ప్రకటించింది. 29 స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. గతంలో 15 ఏండ్లపాటు అధికారంలో ఉన్నా దేశంలోని మిగతా ప్రాంతాల్లో మాదిరిగానే హస్తినలో కూడా జనం మద్దతును కాంగ్రెస్ కోల్పోయింది. గత పదేండ్లుగా ఢిల్లీ అసెంబ్లీలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేని ఈ జాతీయపక్షం గతమెంతో ఘనమనే భ్రమల నుంచి ఇంకా బయటపడటం లేదు. ఒంటరి పోరుకు భయపడుతున్న ఈ పార్టీ చివరి క్షణంలోనైనా 'ఆప్'తో పొత్తు కుదరకపోతుందా అనే ఆశతో కాలం గడుపుతున్నది. కిందటి లోక్‌సభ ఎన్నికల్లో ఆప్-కాంగ్రెస్ పొత్తు మంచి ఫలితాలు ఇవ్వకపోగా 'ఆప్'కు నష్టదాయకంగా మార్చింది. పొరుగున్న ఉన్న హరియాణాలో మాదిరిగానే ఆప్, కాంగ్రెస్ మధ్య ఢిల్లీలో పొత్తు ఉండదని కేజ్రీవాల్ ఇది వరకే ప్రకటించారు. ఈడీ, సీబీఐలను 'ఆప్' నేతలపై ఆయుధాలుగా వాడిన బీజేపీ విషయానికి వస్తే కేజ్రీవాల్ మళ్లీ అధికారంలోకి రాకుండా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నది. ఒకవేళ 'ఆప్' గతంలో మాదిరిగా భారీ మెజారిటీతో గెలిచినా ఆ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కావడానికి న్యాయపరమైన చిక్కులున్నాయా? లేవా? అనే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాస్త కోలుకుందనుకున్న కాంగ్రెస్ ఇటీవలి హరియాణా, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో చావు దెబ్బతిన్న కారణంగా ఢిల్లీ రేసులో అసలు ఉందా? అనే అనుమానం వస్తున్నది. 'ఫిర్ లాయేంగే కేజ్రీవాల్' (కేజ్రీవాల్‌ను మళ్లీ గద్దెనెక్కిద్దాం) అనే ఆమ్ ఆద్మీ పార్టీ నినాదానికి, 'బదల్ కే రహేంగే' (పాలకపక్షాన్ని మార్చేద్దాం) అనే బీజేపీ పిలుపు మధ్య జరుగుతున్న ప్రజా సమరంలో గెలుపు ఎవరిదో వచ్చే ఫిబ్రవరి 8న జరిగే ఓట్ల లెక్కింపుతో తేలిపోతుంది.

## ఆర్‌జెడి అధ్యక్షుడిగా తేజస్వీయాదవ్



పాట్నా : రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) అధ్యక్షుడిగా తేజస్వీయాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పాట్నాలో నిర్వహించిన ఆర్‌జెడి జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన కుమారుడు, బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్న తేజస్వీయాదవ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకుంటున్నట్లు పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ పేర్కొంది. పార్టీలో తేజస్వీయాదవ్ స్థాయి పెరగడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. తేజస్వీయాదవ్ కూడా లాలూ యాదవ్‌తో పాటు పార్టీ, పార్టీ టిక్కెట్, గుర్తులో సవరణలకు సంబంధించిన కీలకమైన నిర్ణయాలు తీసుకోవచ్చని తీర్మానం పేర్కొంది.

## పోలీస్ వాలంటీర్ సంజయ్ రాయ్ దోషి : సీల్డా కోర్టు తీర్పు



కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లోని ఆర్‌జి.కార్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలి హత్యాచారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారిస్తూ సీల్డా కోర్టు శనివారం తీర్పునిచ్చింది. శిక్ష వివరాలు సోమవారం వెల్లడించనున్నట్లు పేర్కొంది. సిబిఐ సమర్పించిన సాక్ష్యాధారాల ఆధారంగా నిందితుడు సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారిస్తున్నామని, దీనికి అత్యధిక శిక్ష మరణశిక్ష, కనీస శిక్ష జీవిత ఖైదు అని జడ్జి అనిర్బన్ దాస్ పేర్కొన్నారు. బిఎన్ఎస్ సెక్షన్ 64,66, 103(1) ప్రకారం నిందితుడిని దోషిగా నిర్ధారించామని తెలిపారు. తీర్పు వెల్లడించే సమయంలో బాధితురాలి తల్లిదండ్రులు కోర్టు ఆవరణలోనే ఉన్నారు. 2024, అక్టోబర్ 7న ఈ కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేసిన తర్వాత అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు, సీల్డా కోర్టు రోజువారీ విచారణను నిర్వహించింది. పోలీస్ వాలంటీర్ సంజరురారు నేరానికి పాల్పడినట్లు సిబిఐ పేర్కొంది.

## మొదటిసారి కోర్టు మెట్లెక్కిన అభిశంసనకు గురైన అధ్యక్షుడు



సియోల్ : అభిశంసనకు గురైన దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అరెస్ట్ వారెంట్‌పై విచారణ కోసం శనివారం మొదటిసారి కోర్టుకు హాజరయ్యారు. గతేడాది డిసెంబర్ 3న ఏకపక్షంగా జారీ చేసిన మార్షల్ లా డిక్రీపై దర్యాప్తు అధికారులు విచారిస్తున్నందున నిర్బంధాన్ని కొనసాగిస్తారా లేదా అనేది నేడు నిర్ణయిస్తారు. యూన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎట్టకేలకు గురువారం అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. యూన్ కస్టడీని పొడిగించేందుకు దర్యాప్తు అధికారులు శుక్రవారం కొత్త వారెంట్‌ను జారీ చేయాల్సిందిగా అభ్యర్థించారు. ప్రస్తుతం యూన్ కస్టడీలోనే ఉన్నారు. మరోవైపు యూన్ మద్దతుదారులు శనివారం కోర్టు ఎదుట నిరసనకు దిగారు. యూన్‌ను కోర్టుకు తీసుకువస్తున్న వ్యాన్‌ను చుట్టుముట్టేందుకు యత్నించినట్లు స్థానిక మీడియా తెలిపింది.

## బిజెపి మేనిఫెస్టోకు ప్రధాని ఆమోదముద్ర ఉందా



న్యూఢిల్లీ : బిజెపి మేనిఫెస్టోకు ప్రధాని ఆమోద ముద్రా ఉందా అని ఆప్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ ప్రశ్నించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా విడుదల చేసిన మేనిఫెస్టోపై శనివారం ప్రియాంక కక్కర్ విరుచుకుపడ్డారు. ఆప్ ప్రభుత్వ పథకాలను బిజెపి కాపీ కొట్టిందని మండిపడ్డారు. సంక్షేమ పథకాలను ఉచితాలంటూ ప్రధాని విమర్శలు గుప్పించారని, ఈ మేనిఫెస్టోకు ప్రధాని ఆమోద ముద్ర ఉందా అని ఎద్దేవా చేశారు."ఢిల్లీలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయని బిజెపి తన మేనిఫెస్టోలో స్పష్టం చేసింది. కేజ్రీవాల్ పథకాలను తమ మేనిఫెస్టోలో ఆమోదించింది, అంటే ఇప్పటివరకు ప్రధాని మోడీ మన పథకాలను ఉచితాలు అంటూ అబద్ధాలు చెబుతున్నారని అర్థం" అని అన్నారు. ఢిల్లీలో శాంతి భద్రతల పరిస్థితులపై బిజెపి మేనిఫెస్టో పూర్తిగా మౌనంగా ఉందని, నేరగాళ్ల ముఠాలు ఢిల్లీని ఆక్రమించాయని అన్నారు. ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సైతం బిజెపి మేనిఫెస్టోపై విరుచుకుపడ్డారు. బిజెపి స్వీయ ఆలోచనలు , దార్శనికత లేవని మండిపడ్డారు. కేవలం కేజ్రీవాల్ పాలనా నమూనాను మాత్రమే అనుసరిస్తున్నాయని అన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం



గుంటూరు : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గుంటూరు జిల్లా నంబూరు గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నంబూరులోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద మొక్కను నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త సేకరణ, నిర్వహణ, సంపద సృష్టి తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల మూడో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌తో పాటు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పొన్నూరు శాసన సభ్యులు దూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల విజయవాడ వరదల్లో అహర్నిశలు పని చేసి పారిశుద్ధ్య మెరుగుదలకు కృషి చేసిన 35 మంది స్వచ్ఛ కార్మికులను పవన్ కళ్యాణ్ సత్కరించారు. ప్రతి ఒక్కరినీ పేరు పేరునా పలుకరిస్తూ, శాలువా కప్పి నూతన వస్త్రాలు, పళ్లు బహూకరించారు. గ్రామ స్థాయిలో చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన వాహనాలను పవన్ కళ్యాణ్ ప్రారంభించి స్వయంగా నడిపారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా మొదటి విడతగా గ్రామ స్థాయిలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

# ట్రంప్ ప్రమాణానికి... జోరుగా ఏర్పాట్లు



వాషింగ్టన్: అగ్రరాజ్యాధినేతగా డొనాల్డ్ ట్రంప్ (78) రెండోసారి శ్వేతసౌధంలో అడుగుపెట్టేందుకు సర్వం సిద్ధమైంది. అమెరికా 47వ అధ్యక్షునిగా సోమవారం ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా శనివారం నుంచి నాలుగు రోజుల పాటు అట్టహాసంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ప్రమాణస్వీకార కమిటీ ప్రకటించింది. "శనివారం బాణసంచా నడుమ కార్యక్రమాలు లాంఛనంగా మొదలవుతాయి. అనంతరం ఫ్లోరిడాలోని ట్రంప్ గోల్ఫ్ కోర్స్ బయట, వాషింగ్టన్ డీసీలోనూ పలు వీఐపీ ఈవెంట్లు జరుగుతాయి. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ) పేరిట విజయోత్సవ ర్యాలీలుంటాయి. సోమ వారం ట్రంప్ ముందుగా సెయింట్ జాన్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. అనంతరం వైట్‌హౌస్‌లో తేనీటి విందు జరుగుతుంది. ఆ తర్వాత కాపిటల్ భవనంలోని వెస్ట్ లాన్‌లో (స్థానిక కాలమానం ప్రకారం) ఉదయం 9.30 నుంచి ప్రధాన కార్యక్రమం ఉంటుంది. సంగీత కార్యక్రమాల అనంతరం ట్రంప్ లాంఛనంగా పదవీ ప్రమాణం చేసి అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తారు. తర్వాత జె.డి.వాన్స్ ఉపాధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తారు. అనంతరం తన లక్ష్యాలు తదితరాలను వెల్లడిస్తూ అధ్యక్ష హోదాలో ట్రంప్ తొలి ప్రసంగం చేస్తారు. తర్వాత సెనేట్ చాంబర్లోని ప్రెసిడెంట్ రూమ్‌లో కీలక పత్రాలపై సంతకం చేయడంతో ప్రమాణ కార్యక్రమం ముగుస్తుంది. మధ్యాహ్నం తొలి అధికారిక విందు అనంతరం క్యాపిటల్ హిల్ భవనం నుంచి పెన్సిల్వేనియా అవెన్యూ మీదుగా వైట్‌హౌస్ దాకా ట్రంప్ పరేడ్‌గా వెళ్తారు" అని వెల్లడించింది. కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశ నలుమూలల నుంచీ ఏకంగా 2 లక్షల మంది సోమవారానికల్లా వాషింగ్టన్ చేరుకుంటారని కమిటీ తెలిపింది. నవంబర్ 6న జరిగిన ఎన్నికల్లో డెమొక్రాట్ల అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై ట్రంప్ ఘనవిజయం సాధించి రెండోసారి అధ్యక్షుడు కానున్నారు. 2017-2021 మధ్య తొలిసారి అధ్యక్షునిగా పని చేయడం తెలిసిందే.

### మాజీ అధ్యక్షులంతా హాజరు

సోమవారం ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్, కమలతో పాటు మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జి డబ్ల్యు.బుష్, బరాక్ ఒబామా కూడా పాల్గొంటారు. వీరిలో ఒబామా మినహా మిగతా వారంతా సతీసమేతంగా వస్తున్నారు. పలువురు దేశాధినేతలు, వీవీఐపీలు, ప్రముఖులు కూడా పాల్గొననున్నారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్, చైనా తరఫున ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ ప్రమాణ స్వీకారానికి హాజరవుతున్నారు. అల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్‌తో పాటు ఐటీ, ఇతర దిగ్గజ సంస్థల అధినేతలు కూడా హాజరవుతున్నారు. ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్ (ఫేస్‌బుక్), జెఫ్ బెజోస్ (అమెజాన్) రూపంలో ప్రపంచ కుబేరుల్లో ముగ్గురు వేదికపై కనిపించనుండటం విశేషం. ట్రంప్ హయాంలో అమెరికా టెక్ బిలియనీర్ల అడ్డగా మారనుందని బైడెన్ తాజాగా తన వీడ్కోలు సందేశంలో హెచ్చరించడం తెలిసిందే.

### అధికారిక ఫొటోల విడుదల

ప్రమాణస్వీకార సంబంధిత కార్యక్రమాల్లో ఉపయోగించేందుకు ట్రంప్, వాన్స్ అధికారిక చిత్రాలను తాజాగా విడుదల చేశారు. వాన్స్ చేతులు కట్టుకుని సరదాగా చిరునవ్వులు చిందిస్తుండగా ట్రంప్ ఫొటో అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. పెదాలు బిగించి, నుదురు చిట్లించి కెమెరావైపు తీక్షణంగా చూస్తూ కనిపిస్తున్నారు. ఇది అచ్చం కాపిటల్ హిల్ దాడి కేసులో 2023లో ట్రంప్ న్యాయ విచారణకు హాజరైన సందర్భంగా పోలీసు అధికారులు తీసుకున్న ఆయన మగ్ షాట్‌ను పోలి ఉండటం విశేషం. రెండో టర్ములో సంప్రదాయ పోకడలను మరింతగా ధిక్కరించి తీరతానని ప్రతీకాత్మకంగా చెప్పేందుకు ట్రంప్ కావాలనే ఇలాంటి ఫొటోను ఎంచుకున్నారని భావిస్తున్నారు.

### హాలీవుడ్ ప్రత్యేక రాయబారులుగా గిబ్సన్ తదితరులు

నటులు జాన్ వొయిట్, మెల్ గిబ్సన్, సిల్వెస్టర్ స్టాలోన్‌లను హాలీవుడ్ ప్రత్యేక రాయబారులుగా నియమిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. నాలుగేళ్లుగా నేలచూపులు చూస్తున్న హాలీవుడ్‌ను బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నాల్లో వారు తనకు సహాయ సహకారాలు అందిస్తారని వెల్లడించారు. వీరిలో వొయిట్ చిరకాలంగా ట్రంప్‌కు మద్దతుదారు కాగా గిబ్సన్, స్టాలోన్ కూడా తాజా ఎన్నికల్లో ట్రంప్‌ను బలపరిచారు.

# కుంభ (బాధల) మేళా



'పుణ్యం కోసం వెళ్తే పాపం చుట్టుకుందనే' నానుడికి 'ప్రయాగ్‌రాజ్' సరిగ్గా సరిపోతుంది.ప్రపంచంలోనే ప్రసిద్ధిగల ఆధ్యాత్మిక వేడుకగా పిలువబడుతున్న 'మహా కుంభ మేళా' ఈనెల 13న ఉత్తరప్రదేశ్‌లో ప్రారంభమైంది. ఫిబ్రవరి 26వరకు 45 రోజుల పాటు సాగే ఈ క్రతువుకు దేశ,విదేశాల నుంచి సుమారు యాభై కోట్ల వరకు హాజరవుతారని యూపీ సర్కార్ అంచనా వేసింది. అయితే అందుకు తగిన వసతులు, భద్రతా ఏర్పాట్లు చేసిందా? నూట నలభై కోట్ల మన జనాభాలో మూప్పావు వంతు జనం ప్రయాగ్‌రాజ్‌కే తరలుతున్న పరిస్థితి. ఈమూడు రోజుల్లోనే సుమారు ఆరుకోట్ల మంది సందర్శకులు వచ్చినట్టు వార్తలు. గుడి వద్ద వందమంది గుమికూడితేనే వారిని క్రమపద్ధతిలో పెట్టడం ఒక పెద్ద సమస్య. అలాంటిది కోట్లమంది సందర్శించే ప్రాంతం,అక్కడి పరిసర వాతావరణం ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఏదైనా ప్రమాదం తలెత్తితే జరిగే నష్టాన్ని అంచనా కూడా వేయలేం. పన్నెండేండ్లకు ఓసారి వచ్చే మహా కుంభమేళాలో భాగంగా గంగా, యుమునా, సరస్వతీ నదులు కలిసే త్రివేణి సంగమంలో భక్తులు స్నానాలా చరిస్తే పుణ్యం వస్తుందని, ఆయూరా రోగ్యాలు సిద్ధిస్తాయని ప్రజల నమ్మకం, ఆధ్యాత్మికవేత్తల ప్రచారం కూడా. అయితే ప్రజల విశ్వా సాన్ని మూఢత్వంలోకి తీసుకెళ్లే తీరు పెరిగింది. మోడీ అధికారంలోకి వచ్చిన ఈ పదేండ్లలో ఇది మరింత రెట్టింపయింది. పదివేల ఎకరాల్లో ఏర్పాటు చేసిన మహాకుంభమేళాను 55 పోలీస్‌స్టేషన్లు, 45వేల మంది పోలీసులతో భద్రతను పర్యవేక్షిస్తున్నామని యోగి సర్కార్ చెబుతున్నది. కానీ వైద్య సౌకర్యాల పరిస్థితేమిటి? నామమాత్రం. ఇప్పటికే చలికి తట్టుకోలేక పద కొండుమంది చనిపోయినట్టు సమాచారం.దీన్ని ప్రభుత్వం కొట్టిపారేస్తున్నది. ఈ మేళాలో వివక్ష కూడా బయటపడింది. సీఎం యోగి కమ్యూనిటీకి చెందిన వారికే అక్కడ సకల సౌకర్యాల్ని కల్పించి మిగతా భక్తుల్ని గాలికొదిలేసింది. 'పుష్కరాల్లో మునగండి..పుణ్యం తెచ్చుకోండి' అంటూ ఆరెస్సెస్-బీజేపీ పరివారం ప్రచారం చేస్తున్నది. కానీ నదిలో మునిగితే నీళ్లు కలుషితమై రోగాలు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వారు చెప్పింది వాస్తవం. ఇటీవల నదిలో స్నానం చేసిన యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్ భార్య పావెల్ అలర్జీతో బాధపడుతున్నట్టు లజాతీయ మీడియా పేర్కొంది. స్నానం చేస్తున్నప్పుడు నీళ్లలోనే మూత్రం వదలడం జీవ సహజ లక్షణం. లక్షలాది మంది పాల్గొనే మేళాలో అన్ని టాయిలెట్లు కూడా ఉండవు. అలాగే ఒళ్లంతా బూడిద పూసుకున్న అఘోరీలు, సాధువులు కూడా ఇందులోనే మునుగుతారు. భక్తులు స్నానం చేస్తున్నప్పుడు ఈ నీళ్లన్నీ సహజంగానే నోట్లోకి పోతాయి. అది 'పవిత్ర' జలమా? పుష్కరాల్లో మునిగితే పుణ్యంమాట దేవుడెరుగు అంటువ్యాధులు రావడం మాత్రం ఖాయం. ఇటీవల తిరుపతిలో జరిగిన ఘటన గుర్తుండే ఉంటుంది. వైకుంఠ ద్వారా దర్శనం టోకెన్లు జారీచేసే కేంద్రం వద్ద తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారు, అనేకమంది గాయపడ్డారు. వేలాది మందిలోనే అంతటి ప్రాణనష్టం సంభవిస్తే, లక్షలాది మంది పాల్గొంటున్న మహా కుంభమేళాలో ఇలాంటిదేదైనా పొరపాటు జరిగితే? ఎవరైనా ఆ దిశగా ఆలోచించారా? గతేడాది హత్రాస్‌లో బోలేబాబా ఆశ్రమంలో జరిగిన ఘోర దుర్ఘటన మరచిపోగలమా? బాబా కాలి దూళిని తాకడానికి ప్రయత్నించిన భక్తులు తొక్కిసలాటలో 238 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదివరకు జరిగిన ఉజ్జయినీ, నాసిక్ కుంభమేళాల్లోనూ పదుల సంఖ్యలో చనిపోయారు. 1954 నుంచి జరుగుతున్న ఇలాంటి మేళాలు, కార్యక్రమాల్లో రెండువేలకు పైగానే మరణించినట్టు సమాచారం. మతం వ్యక్తిగతం, విశ్వాసాల్ని కాదనలేం.ఎవరి విశ్వాసాలు వారికుంటాయి. కానీ వాటిని యథేచ్ఛగా ప్రేరేపించి లబ్ధి పొందాలనుకోవడమే ప్రమాదకరం. కేంద్రంలో బీజేపీ, యూపీలో యోగి సర్కార్ చేస్తున్నదదే. శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ సమాజంలో ఆరాధన, విశ్వాసం తగ్గాలి. కానీ ఆచరణలో అందుకు భిన్నంగా ఉండటం ఆందోళనా కరం. ప్రజల్లో తరతరాలుగా వారి మెదళ్లలో నాటుకున్న విశ్వాసాల్ని వ్యాపార సరుకుగా మార్చిన పాలక పార్టీల నేతలు పుష్కరాలు, ప్రత్యేక దర్శనాలు, మేళాల పేరుతో వారిని స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్న పరిస్థితి బాధాకరం. ప్రజల బాధలకు దేవుడు కారణం కాదు, ఆ వైపున ప్రజల్ని మళ్లించడం భావ్యం అంతకన్నా కాదు.ప్రజల కష్టాలు తీర్చాల్సింది, కన్నీళ్లు తుడవాల్సింది ప్రజలెన్నుకున్న పాలకులే. 1990ల్లో వచ్చిన ప్రపంచీకరణ విధానాలు ప్రజలకు ఉపాధి అవకాశాలు తగ్గించాయి. వీటిననుసరించిన ప్రభు త్వాలు ప్రజల్ని భ్రమల్లో ముంచి ఆశలు పెంచాయి. దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన జనం ఓ వైపు రాజకీయ పార్టీలను, మరోవైపు మతవిశ్వాసాలను ఆశ్రయించాల్సిన పరిస్థితికి తెచ్చాయి. పాలక పార్టీల వాగ్దానాలను నమ్మి మోసపోవడం ఒకటైతే, కనిపించని దైవం కరుణిస్తుందనే ఆశతో పరుగులు పెట్టడం మరోటి. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని అనుకోని ఘటన జరిగితే కన్నుమూయడం పరిపాటి. ఇలాంటివి పునరావృతం కాకుండా అడుకట్ట వేయాల్సింది ప్రజా చైతన్యం. దాన్ని ముందుకు తీసుకెళ్లాల్సింది పౌర సమాజం.

# గాజాపై యుద్ధ పడగనీడ ఇంకెంతకాలం?






శాంతి సమభావం సమిష్టిక్షేమం ఈనాటి యుగధర్మంగా అభివర్ణించాడు మహాకవి శ్రీశ్రీ. ఎవరు ఏ స్థాయిలో ఉన్నా ఆధునిక యుగంలో ఈ మానవధర్మాలకు కట్టుబడి ఉండాల్సిందేనని ఆ వాక్య తాత్పర్యం. యుద్ధోన్మాదం ఓ మానసిక అంటువ్యాధి అని, కాపట్యం ఉన్నచోట శాంతి సాధించుట అసాధ్యమని మహా రచయిత టాల్‌స్టాయ్ పేర్కొంటాడు. శాంతి సాధన నుండి పిరికితనంగా తప్పించుకోవడం కూడా యుద్ధోన్మాదం కిందకే వస్తుందని ఆయన తెలుపుతాడు. ప్రస్తుతం గాజా విషయంలో జరుగుతున్నదదే. ఇజ్రాయిల్-హమాస్ మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం సంక్షోభంలో పడటం అందుకు తార్కాణం. ఆదివారం నుండి ఈ ఒప్పందం అమల్లోకి రావాల్సి ఉంది. కానీ ఇంతలోనే తనకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అడ్డం తిరిగాడు. ప్రత్యర్థి హమాస్ మరిన్ని రాయితీలు పొందేందుకు ఒప్పందంలోని కొన్ని అంశాలనుండి వెనక్కి తగ్గుతున్నదని ఆరోపణ చేశాడు. కానీ ఏయే అంశాల్లో వెనక్కి తగ్గుతున్నది అంటే మాత్రం సూటిగా స్పష్టంగా ఆయన చెప్పడు. దీంతో మధ్యవర్తిత్వం నెరుపుతున్న ఖాతర్‌తో పాటు మిగిలిన ప్రపంచం అంతా నెత్తి పట్టుకోవాల్సి వచ్చింది. ఒప్పందం కుదిరిందని ఖాతర్‌తో పాటు అమెరికా ప్రెసిడెంట్ జోబైడెన్ కూడా ప్రకటించారు. మరి ఇంతలోనే ఈ పిడుగుపాటు ఏమిటి? అసలు గాజా నుండి ఇజ్రాయిల్ సైనికదళాలు పూర్తి ఉపసంహరణకు యుద్ధో న్మాది నెతన్యాహు సిద్ధంగా లేడనే విషయం తెలుస్తున్నది. బుధవారం రాత్రి కాల్పుల విరమణ ఒప్పందం కుదిరందని తెలియగానే పాపం పాలస్తీనియులు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. యుద్ధ పడగనీడ వీడబోతున్నదని, తాము కూడా ఇతర ప్రజానీకం మాదిరి సుఖశాంతులతో పనిపాటలతో హాయిగా జీవించవచ్చునని ఆశపడ్డారు. కాని ఆశించినంత సేపు పట్టలేదు. ఆశా బుడగ చిటికలో పేలిపోయింది. ఆశాభంగమైంది. మరోవైపు గాజా శాంతి ఒప్పందాన్ని భారత్, రష్యా, చైనా, బ్రిటన్‌తో సహా పలుదేశాలు స్వాగతించాయి. గాజాకు 123 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్టు ఐరోపా యూనియన్ ప్రకటించింది కూడా. కానీ గాజాపై ఇజ్రాయిల్ అమానుష దాడులు ఇంకా కొనసాగిస్తూనే ఉన్నది. తాజాగా జరిపిన దాడుల్లో 72మంది మృతిచెందినట్టు గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిసింది. 2023 అక్టోబరు 7న 'హమాస్' ఇజ్రాయిల్‌పై దాడి చేయ డంతో 1200 మంది మృతి చెందారు. 251 మంది బంధీలుగా పట్టుకుపోయారు. వీరిలో కొందరు ఇప్పటికే విడుదల కాగా మరికొందరు మరణించారు. ఇంకా 62 మంది సజీవంగా ఉన్నట్టు అంచనా. దాదాపు 15 నెలలుగా సాగు తున్న ఈ యుద్ధదాడిలో 46 వేల మందికి పైగా పాలస్తీనియులు మరణించడం గమనార్హం. వీరిలో సగం మందికి పైగా స్త్రీలు, పిల్లలే ఉన్నారు. లక్షా పదివేలమంది క్షతగాత్రులయ్యారు. ఇజ్రాయిల్ సైనికులు 840 మంది మృతి చెందితే, హమాస్ మిలిటెంట్లు 17 వేలమంది చనిపోయారనేది సమాచారం. పదివేలకు పైగా రాకెట్ దాడులు జరిగాయి. గాజా భూభాగం నేడు తొంబై శాతం ఇజ్రాయిల్ ఆక్రమణలో ఉన్నది. 'ఇజ్రాయిల్ - హమాస్ మధ్య 96 గంటల పాటు చర్చలు జరిగాయని, సుదీర్ఘమైన కసరత్తు చేయడం ద్వారా ఒప్పందం సాకారం అయింది' అని ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అంటుంటే, 'నేను అమెరికా అధ్యక్షునిగా పదవి స్వీకరించే నాటికి (జనవరి 20) బంధీలకు స్వేచ్ఛ లభించకపోతే సర్వనాశనం కావడం ఖాయమని హెచ్చరించడం వల్లనే ఒప్పందం కుదిరిందని డొనాల్డ్ ట్రంప్ అంటున్నాడు. అంటే అమెరికా గుప్పెట్లోనే ఇజ్రాయిల్ ఉన్నదనే సంకేతం అర్థమవుతున్నది. అమెరికా, ఇజ్రాయిల్ పాలక వర్గాల యుద్ధోన్మోదం ప్రపంచ ప్రజలకు తెలియంది కాదు. ఆ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా అనేక దేశాల్లో పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నా వారికి చీమకుట్టి నట్టయినా ఉండటం లేదు. ఇంతకన్నా పెనువిషాదం ఏముంటుంది? ప్రస్తుతం కాల్పుల విరమణ లేదు. యుద్ధదాడి జరుగుతూనే ఉన్నది. మానవ హననం, విధ్వంసం సాగుతూనే ఉన్నది. తొలిదశంగా తాత్కాలిక కాల్పుల విరమణ జరిగితేనే, మలిదశలో శాశ్విత శాంతి పథం వైపు అడుగులు పడుతాయి. అప్పటివరకు గాజు ప్రజల ప్రాణాలు యుద్ధోన్మాదుల పడగనీడలోనే ఉంటాయి.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com